
శాసనమండలి గౌరవాన్ని కాపాడే విధంగా మండలి చైర్మన్ వ్యవహరించాలి. సభాహక్కులు, సభ్యుల హక్కులను పరిరక్షించే బాధ్యత అధ్యక్ష స్థానంలో ఉన్న చైర్మన్‌పై ఉంటుంది. మండలి సభ్యుడు తన శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేస్తానని సభలో ప్రకటించినప్పటికీ, ఆ రాజీనామాను చైర్మన్ ఆమోదించకపోవడం సరి కాదు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శనివారం 25.04.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 3 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# సాగు భద్రత

## అధిక ఆదాయం సాధించడమే లక్ష్యం

ఏడాదంతా పొలం పచ్చగా ఉండాలి - రైతన్న పంట పండాలి

ఎల్‌నినో ఎదుర్కొనేలా ముందస్తు చర్యలు - పీఎండీఎస్ అమలు

50 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ సాగుకు యాక్షన్ ప్లాన్

హెక్టారుకు తగ్గిన సగటు యూరియా వినియోగం

ఈ ఏడాది 11 లక్షల హెక్టార్లలో ప్రకృతి సాగు

250 ఎకరాల్లో కోకో సిటీ-ఎక్స్‌పీరియన్స్ సెంటర్


వ్యవసాయం, అనుబంధ రంగాల సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేలా... రైతులకు భద్రత, అధిక ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. డిమాండ్ ఉన్న పంటల్ని సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని... ఏది లాభదాయకమో దాని గురించి వివరించి చెప్పాలని సీఎం అన్నారు. అలాగే 365 రోజులు పంటలు పండించేలా చూడాలని, భూమిని భాగాలుగా విభజించి ఒకే రైతు వివిధ రకాల పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రైతులు ప్రకృతి సాగు కింద చేసే ఉత్పత్తులను సర్టిఫికేషన్‌తో విక్రయించేలా చర్యలు చేపట్టాలని, దీంతో ఆయా ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందని అధికారులతో సీఎం చెప్పారు. రాష్ట్రంలో గతేడాది రబీలో హెక్టారుకు యూరియా వినియోగం తగ్గడం శుభపరిణామమని అన్నారు. రైతు బజార్ల నుంచి డోర్ డెలివరీ చేసేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని, దీని కోసం ఏదైనా ఏజెన్సీ సేవలు వినియోగించుకునేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. రాయలసీమను గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌గా చేసేందుకు క్లస్టర్ల వారీగా అభివృద్ధి కార్యాచరణ చేపట్టాలన్నారు. ప్రపంచంలోనే తొలిసారిగా కోకో పంటకు సంబంధించి 'కోకో సిటీ' ఏర్పాటు చేస్తున్నామని... కోకో సిటీ ఔత్సాహిక రైతులకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా ఉండాలని అధికారులకు సీఎం సూచించారు. 250 ఎకరాల్లో దీనిని ఏర్పాటు చేసేందుకు సరైన ప్రాంతాన్ని ఎంపిక చేయాలని ఆదేశించారు.

**ఏపీ మష్రూమ్ మిషన్ 2026-31:** అరకు ఏజెన్సీలో కుంకుమ పువ్వు సాగును మరింత విస్తరించేలా, మంచి నాణ్యమైన దిగుబడులు వచ్చేలా అధ్యయనం జరపాలన్నారు. ఏపీ మష్రూమ్ మిషన్ 2026-2031 కింద ఏడాదికి లక్ష మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించాలని సీఎం లక్ష్యాన్ని నిర్దేశించారు. అనంతపురంలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న ఆపిల్, పండ్లు రుచికరంగా ఉన్నాయని, వాతావరణం కూడా అనుకూలించిందని అధికారులు చెప్పగా, మరింత విస్తీర్ణంలో సాగు జరిపేలా అక్కడ వాతావరణాన్ని అధ్యయనం చేయాలని చెప్పారు. అలాగే అవకాడో, అంజీర్, పనస, జామ, మిరియాల సాగును పెంచేలా దృష్టి పెట్టాలని నిర్దేశించారు. అంజీర్ వంటి పండ్లను డ్రైఫ్రూట్‌గా మార్చి వాటి విలువ పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో మొత్తం 50 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ సాగు జరిగేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. బీపీఎల్‌కు దిగువన ఉన్న రైతు కుటుంబాలకు అనుబంధంగా డెయిరీ, లైవ్ స్టాక్ ద్వారా అదనపు ఆదాయం పొందేలా సహకారం అందిచాల్సి ఉందని సీఎం అన్నారు. దీనికి ప్రభుత్వం నుంచి సాయం అందించేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు.

**8 లక్షలు దాటిన ఫార్మర్ యాప్ రిజిస్ట్రేషన్లు :** రాష్ట్రమంతా క్రాప్ సర్వే చేస్తున్నామని... సాగవుతున్న పంటలు, అక్కడ జలవనరుల వివరాలు నమోదు చేస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఫార్మర్ యాప్‌తో రాష్ట్రంలో రైతులు, భూ విస్తీర్ణం, భూసార పరీక్షలు, యూరియా-పురుగుమందులు-విత్తనాల వినియోగం వివరాలు, ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలు వంటి సమాచారం అంతా యాప్‌లో పొందుపరిచామని అధికారులు వివరించారు. ఆ ఏరియాలో భూగర్భ జలాలు, సమీప జలవనరుల వివరాలు ఉంటాయని, ఏ పంటలు రైతులు వేసుకుంటారనే దానిబట్టి అక్కడ వాతావరణ సమాచారం, యూరియా, విత్తనాలు అవసరాలు తెలియజేస్తున్నామని చెప్పారు. ఫార్మర్ యాప్ రిజిస్ట్రేషన్లు ఇప్పటివరకు 8 లక్షల మంది రైతులు చేసుకున్నారని మిగతా 2లో...

# శాసనమండలి గౌరవాన్ని కాపాడే విధంగా చైర్మన్ వ్యవహరించాలి



- **ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్**

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** శాసనమండలి గౌరవాన్ని కాపాడే విధంగా మండలి చైర్మన్ వ్యవహరించాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సూచించారు. సభాహక్కులు, సభ్యుల హక్కులను పరిరక్షించే బాధ్యత అధ్యక్ష స్థానంలో ఉన్న చైర్మన్‌పై ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

శుక్రవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆలపాటి రాజేంద్రప్రసాద్, శాసనమండలి చైర్మన్ వ్యవహార శైలి మండలి గౌరవాన్ని తగ్గించే విధంగా ఉందనే భావన వ్యక్తం చేశారు. ఏ పార్టీకి చెందిన వారైనా అధ్యక్ష స్థానంలో ఉన్న వ్యక్తి నిష్పక్షపాత వైఖరితో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

ఒక మండలి సభ్యుడు తన శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేస్తానని సభలో ప్రకటించినప్పటికీ, ఆ రాజీనామాను చైర్మన్ ఆమోదించకపోవడం ప్రశ్నార్థకమన్నారు.


అనంతరం ఆ సభ్యుడు హైకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేసినప్పుడు, దానికి కౌంటర్ దాఖలు చేయకపోవడం వల్ల హైకోర్టు పది వేల రూపాయల జరిమానా విధించే పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.

చట్టాలను రూపొందించి అమలు చేయాల్సిన శాసనసభల నుంచే చట్ట ఉల్లంఘన జరిగేలా వ్యవహరిస్తే ప్రజలు ఎలా ఆలోచిస్తారని ఆయన అన్నారు. ఇటువంటి పరిస్థితులు సభపై ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీస్తాయని, సభ్యుల పట్ల కూడా అపోహలు పెరుగుతాయని పేర్కొన్నారు.

మండలి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అధ్యక్ష స్థానంలో ఉన్న వారికి ఉందా లేదా అన్నది స్పష్టం చేయాలని కోరారు. సభాహక్కులను, సభ్యుల హక్కులను పరిరక్షిస్తూ చైర్మన్ నిష్పక్షపాత ధోరణితో వ్యవహరించాలని ఆలపాటి రాజేంద్రప్రసాద్ సూచించారు.

# పాలనా సంస్కర్తకు ప్రతిష్ఠాత్మక అవార్డు

- **ఎకనమిక్ టైమ్స్ బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు స్వీకరించనున్న సీఎం**
- **నేడు ముంబైకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతిష్ఠాత్మక మీడియా సంస్థ ఎకనమిక్ టైమ్స్ ప్రకటించిన బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ 2025 అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందుకోనున్నారు. ముంబైలో శనివారం సాయంత్రం జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం అమరావతి నుంచి బయల్దేరి వెళ్లనున్నారు. శనివారం మధ్యాహ్నం 12.50 గంటలకు సీఎం క్యాంప్ ఆఫీసు నుంచి బయలుదేరి వెళ్తారు. 2.40 గంటలకు ముంబై విమానాశ్రయం చేరుకుంటారు. అనంతరం సాయంత్రం 5.25 గంటలకు వెన్యూ అయిన జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌కు వెళ్తారు. రాత్రి 9.30 వరకు ఎకనమిక్ టైమ్స్ నిర్వహించే అవార్డుల కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి 9.50 గంటలకు ముంబై నుంచి తిరుగు ప్రయాణం అవుతారు.

**విప్లవాత్మక విధానాల అమలుకు దక్కిన గుర్తింపు :** రేపు సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల వరకూ జరిగే కార్యక్రమంలో ఆయన ఈ అవార్డు అందుకోనున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహా దిగ్గజ పారిశ్రామిక దిగ్గజాల సమక్షంలో ఎకనమిక్ టైమ్స్ సంస్థ ఈ అవార్డు ను ముఖ్యమంత్రికి ప్రధానం చేయనుంది. ఏపీలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సహా స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు లాంటి విప్లవాత్మక విధానాలు అమలుకు గాను ఎకనామిక్ టైమ్స్ ఈ అవార్డుకు సీఎం చంద్రబాబును ఎంపిక చేసింది. గతంలో అరుణ్ జైట్లీ, పీయూష్ గోయల్, నితీష్ కుమార్, అశ్వినీ వైష్ణవ్, జైశంకర్ తదితర ప్రముఖులకు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు వరించింది.

**సీబీఎన్ బ్రాండ్ ఇమేజ్‌తో ఏపీకి పెట్టుబడులు :** రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం, పారిశ్రామిక విధానాల్లో విప్లవాత్మక మార్పులు-పారిశ్రామిక అనుకూల పాలసీలు తీసుకు రావడంలో చంద్రబాబు పోషిస్తున్న పాత్రను ఎకనమిక్ టైమ్స్ జ్యూరీ కొనియాడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే ఏపీకి రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకు రావడంలో విజయవంతం కావడం, పారిశ్రామిక అనుమతుల ప్రక్రియను సరళతరం చేస్తూ అమలు చేస్తున్న సంస్కరణలు, టెక్నాలజీ, మిగతా 2లో...

# అమరావతి మెట్రోకు రూ.11 కోట్లు



**అమరావతి( జర్నలిస్ట్ ఫైల్):** అమరావతి మెట్రోరైల్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ.11 కోట్లు కేటాయించింది. దీనికి సంబంధించి పరిపాలనా పరమైన అనుమతులు ఇస్తూ శుక్రవారం జిఓ నెంబరు 459 విడుదల చేసింది. 2026-27 నాలుగో క్వార్టర్ కింద ఈ నిధులు కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిధులను కార్యాలయ నిర్వహణ కోసం కేటాయించింది. 2లో...

# ఎంఎల్‌సి అనంతబాబు అరెస్ట్



**రాజమండ్రి (జర్నలిస్ట్ ఫైల్):** దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రధాన నిందితునిగా ఉన్న వైసిపి ఎంఎల్‌సి అనంత సత్య ఉదరు భాస్కర్ (అనంతబాబు)ను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సాక్షులను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడంపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనను అరెస్టు చేసిన పోలీసులు తెలిపారు. తనను అనంతబాబు బెదిరించారని, తప్పుడు సాక్ష్యం చెప్పాలని ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించారని దుర్గాశివప్రసాద్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ నెల 21న కేసు నమోదు చేశారు. అనంతబాబు బెయిల్ రద్దు చేయాలని ఈ నెల 22న రాజమండ్రి ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ నేపథ్యంలో విచారణకు హాజరైన తర్వాత కోర్టు నుంచి బయటకు రాగానే ఆయనను పోలీసులు అరెస్టు చేసి కాకినాడలోని సర్పవరం క్రైమ్ స్టేషన్‌కు తరలించారు. అనంతబాబును శనివారం ఉదయం కోర్టులో హాజరు పరుస్తామని ఇన్‌ఛార్జి సిఐ జి.చెన్నకేశవరావు తెలిపారు.

## హుగ్లీ అందాలు..


# మోదీ క్లిక్కులు!



**పశ్చిమ బెంగాల్( జర్నలిస్ట్ ఫైల్):** ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్‌లో పర్యటిస్తున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో బోట్ రైడ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కెమెరాను చేతపట్టి నది అందాలను క్లిక్‌మనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతితో ముడిపడి మిగతా 2లో...

# మహిళా లోకానికి ప్రతిపక్షాల తీరని అన్యాయం

- **ప్రజల్లోకి వాస్తవాలను తీసుకెళ్లేందుకు సిద్ధం కావాలి.**
- **ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండి కూటమి పక్షాలు అడ్డుకున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ముఖ్యంగా ప్రతి గడపకు ఈ విషయాన్ని తెలియజేయాలని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న ఇండి కూటమి పార్టీల వైఖరిని నిరసిస్తూ ఎన్డీయే తరఫున చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, నారీ శక్తి బిల్లును అడ్డుకోవడం ద్వారా ప్రతిపక్షాలు మహిళా లోకానికి తీరని అన్యాయం చేశాయని విమర్శించారు. మహిళల సాధికారతకు కీలకమైన ఈ బిల్లును అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని అన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఇంటికి, ప్రతి మహిళకు చేరేలా కూటమి తరఫున విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

పెరిగిన జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సిన అవసరం ఉందని, ఈ ప్రక్రియలో ఉత్తరాది--దక్షిణాది అనే భేదం లేకుండా సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ అంశంపై ప్రజల్లో అనవసర అపోహలు సృష్టించకుండా స్పష్టమైన అవగాహన కల్పించాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రతిపక్షాల వైఖరిని ప్రజలకు వివరించి, మహిళల హక్కుల పరిరక్షణలో ఎన్డీయే కట్టుబాటును చాటే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.



# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు

- **"సింగపూర్ వర్సిటీ" పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ టియోతో**
- **మంత్రి సత్యకుమార్ యాదవ్ భేటీ!**
- **ఆరోగ్య రంగం పటిష్టత పై వారివురి మధ్య చర్చ**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ లోని ఆరోగ్య వ్యవస్థను ప్రపంచ స్థాయి ప్రమాణాలకు ధీటుగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. సింగపూర్ పర్యటనలో భాగంగా మిగతా 2లో...

# సింగపూర్ మోడల్‌పై ఏపీ దృష్టి



- **పర్యావరణం, నీటి నిర్వహణ, సాంకేతికతలో ప్రపంచ స్థాయి విధానాల అధ్యయనం చేసిన మంత్రుల బృందం**
- **అమరావతి అభివృద్ధికి అంతర్జాతీయ అనుభవాల అన్వయం**
- **కృష్ణా తీరం అభివృద్ధికి మెరీనా బ్యారేజ్ మోడల్ పరిశీలన**

**సింగపూర్ (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సుస్థిర అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో సింగపూర్‌లో పర్యటిస్తున్న మంత్రుల బృందం శిక్షణ కార్యక్రమం నాలుగవ రోజు కూడా కీలకంగా కొనసాగింది. ప్రపంచంలో అత్యుత్తమ నగర పాలన, పర్యావరణ పరిరక్షణ, నీటి నిర్వహణ, సాంకేతిక వినియోగం వంటి రంగాల్లో సింగపూర్ సాధించిన విజయాలను లోతుగా అధ్యయనం చేస్తూ, వాటిని రాష్ట్రంలో అమలు చేసే మార్గాలను మంత్రులు పరిశీలిస్తున్నారు. మిగతా 2లో...

## పాలనా సంస్కర్తకు ప్రతిష్ఠాత్మక అవార్డు

(మొదటి పేజీ తరువాయి)

ఇన్నోవేషన్, ఐటీ, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో ఏపీని అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ఆయన చేస్తున్న కృషికి గాను ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు వరించింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చిన అనుభవంతో పాటు, ప్రస్తుతం అమరావతి, విశాఖపట్నం వంటి నగరాలను ఆర్థిక కేంద్రాలుగా తీర్చిదిద్దడంలో సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు.

## హుగ్లీ అందాలు.. మోదీ క్లిక్కులు!"



(మొదటి పేజీ తరువాయి)

ఉందని మోదీ పేర్కొన్నారు. బెంగాలీల జీవితాల్లో గంగానదికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, దాని జలాలు ఒక ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకెళ్తాయన్నారు. ఈ రోజు ఉదయం హుగ్లీ నది తీరంలో కొంత సమయం గడిపినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో నదిలో పడవ నడిపేవారితో పాటు, ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని ఈసందర్భంగా మోదీ కొనియాడారు. ఎన్నికల్లో గెలిపిస్తే.. పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోదీ మరో పోస్టులో పేర్కొన్నారు. చరిత్రాత్మక విద్యాసాగర సేతు, హౌవ్‌డా వంతెనను దగ్గరగా చూడటం ఆనందంగా ఉందన్నారు.

## అమరావతి మెట్రోకు రూ.11 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో కాంట్రాక్టు ఉద్యోగుల జిఐఎ కోసం రూ. 3 కోట్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల కోసం రూ.కోటి, ప్రొఫెషనల్ ఉద్యోగుల కోసం రూ.నాలుగు కోట్లు, అద్దెలు, ట్యాక్సుల కోసం రూ. 2.50 కోట్లు, వాహనాల ఖర్చుల కోసం రూ. 50 లక్షలు మొత్తం రూ. 11 కోట్లు విడుదల చేసింది.

## ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి "నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్" పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై.వై. టియోతో మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థ పటిష్టం చేసేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వై వై టియోకు మంత్రి వివరించారు. ముఖ్యంగా వైద్య సేవలను మెరుగుపరిచేందుకు గేట్స్ ఫౌండేషన్తో కుదుర్చుకున్న ఒప్పందం, ఇందుకు తగ్గట్లు తీసుకుంటున్న చర్యల గురించి టియోకు మంత్రి తెలిపారు. పేద రోగులకు అందించే వైద్య సేవల్లో క్రత్రిమ మేదస్సు (ఏఐ)ను వినియోగిస్తున్నామని, ఎన్సీడీ-04 ద్వారా ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు స్క్రీనింగ్ చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రోగుల ఆరోగ్య వివరాలతో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

'స్టెమీ' ప్రోగ్రాం ద్వారా గోల్డెన్ అవర్లో గుండెపోటు బారినపడిన వారికి ఖరీదైన ఇంజక్షన్ను ఉచితం గా అందిస్తున్న విషయాన్ని టియో దృష్టికి మంత్రి తీసుకువెళ్లారు. వైద్య సేవల్లో ఉత్తమ విధానాలు (బెస్ట్ ప్రాక్టీస్) అవలంబించేందుకు సిద్ధంగా ఉన్నామని, తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి టియోను కోరారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య రంగంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపట్ల టియో సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ నేడొక ప్రకటన జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగం పటిష్టతకు అత్యున్నత స్థాయిలో ఏర్పాటుచేసిన సలహా బృందంలో టియో సభ్యులుగా ఉన్నారు. వీరివురి సమావేశం భవిష్యత్తులో రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థ బలోపేతానికి దోహదం చేస్తుంది.

## సింగపూర్ మోడల్‌పై ఏపీ దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

సింగపూర్ ప్రభుత్వ విధానాలపై పీఎంవో మాజీ మంత్రి మిస్టర్ లిమ్ స్వీ సే మంత్రుల బృందానికి సమగ్రంగా వివరణ ఇచ్చారు. దేశ ప్రయోజనాలను ప్రధానంగా ఉంచుకుంటూనే సమాజంలోని ప్రతి వర్గాన్ని భాగస్వామ్యం చేస్తూ ముందుకు సాగే "Nation First నుంచి We First దృక్పథం సింగపూర్ అభివృద్ధికి పునాది అయిందని వివరించారు. ప్రజలు, ప్రభుత్వం మరియు ప్రైవేట్ రంగాలు సమన్వయంతో పనిచేయడం ద్వారా అభివృద్ధి వేగవంతమవుతుందని, దీర్ఘకాలిక ప్రణాళికలు, పారదర్శక పరిపాలన, నిబద్ధత మరియు నిజాయితీ వంటి విలువలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాయని ఆయన తెలిపారు.

**ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం, సమర్థమైన గవర్నెన్స్‌కు మోడల్ :** నియోజకవర్గ స్థాయిలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించే వ్యవస్థలు, స్థానిక సమస్యలను ముందుగానే గుర్తించి తక్షణమే చర్యలు తీసుకునే విధానాలు సింగపూర్‌లో ఎలా అమలవుతున్నాయో మంత్రులు విశ్లేషించారు. ఈ విధానాలు ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కూడా ఇలాంటి వ్యవస్థలను బలోపేతం చేస్తే ప్రజా సేవల నాణ్యత మరింత మెరుగవుతుందని మంత్రులు అభిప్రాయపడ్డారు.

**మెరీనా బ్యారేజ్ సందర్శన, నీటి నిర్వహణలో ప్రపంచానికి ఆదర్శం :** సింగపూర్ పర్యటనలో భాగంగా మంత్రుల బృందం ప్రముఖ మెరీనా బ్యారేజ్‌ను సందర్శించింది. తాగునీటి సరఫరా, వరద నియంత్రణ, పర్యాటక అభివృద్ధి ఈ మూడు అంశాలను సమన్వయం చేస్తూ రూపొందించిన ఈ ప్రాజెక్ట్ సింగపూర్ నీటి నిర్వహణలో కీలక భాగంగా నిలిచింది. ఈ సందర్భంగా నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌కు చెందిన 'NUS Cities' డైరెక్టర్ KO టెంగ్ చై, పర్యావరణ అనుకూల విధానాల ద్వారా సింగపూర్ నీటి సమస్యలను ఎలా అధిగమించిందో వివరించారు. మెరీనా బ్యారేజ్ పరిసరాలు, మెరీనా బే సాండ్స్ వంటి నిర్మాణాల వీక్షణ స్థలంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందడం ద్వారా ఆర్థిక వ్యవస్థకు కూడా తోడ్పడుతున్నట్లు గుర్తించారు.

**అమరావతి అభివృద్ధికి సింగపూర్ మోడల్, కృష్ణా నది తీరంపై కొత్త ఆలోచనలు :** సింగపూర్‌లో చూసిన అభివృద్ధి నమూనాలను కృష్ణా నది తీరం, అమరావతి రాజధాని ప్రాంతాల్లో అమలు చేసే అవకాశాలపై మంత్రులు చర్చించారు. పర్యావరణాన్ని కాపాడుకుంటూనే నీటి వనరులను సమర్థంగా వినియోగించడం, వరద నియంత్రణ చర్యలు, ప్రజలకు వినోదం మరియు జీవన ప్రమాణాలు పెంచే విధానాలను అమలు చేయాలనే దిశగా ఆలోచనలు కొనసాగుతున్నాయి. సింగపూర్ పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్ మంత్రుల బృందం ప్రపంచ స్థాయి పరిపాలన, పర్యావరణ పరిరక్షణ, నీటి నిర్వహణ మరియు నగర అభివృద్ధి రంగాల్లో విలువైన అనుభవాన్ని సొంతం చేసుకుంటోంది. ఈ అనుభవాలను రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా అమలు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను సుస్థిర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు ఈ పర్యటన స్పష్టం చేస్తోంది. ఈ శిక్షణ మరియు అధ్యయన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, బి.సి. జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

# సాగుకు భద్రత-అధిక ఆదాయం సాధించడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)



అధికారులు వివరించగా, రిజిస్ట్రేషన్‌తో పాటు దానిని ఎంతమంది రైతులు వినియోగించి లబ్ది పొందుతున్నారనేది ముఖ్యమని సీఎం అన్నారు. రైతన్నా మీకోసం ఫేజ్ 1లో 48.73 లక్షల కుటుంబాలు, ఫేజ్ 2లో 46.21 లక్షల రైతు కుటుంబాలకు పంచ సూత్రాలపై అవగాహన కల్పించామని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు.

**ఏపీపై ఎల్‌నినో ఎఫెక్ట్-ముందస్తు చర్యలు :** ఈ ఏడాది నైరుతి రుతుపవనాలతో సగటు వర్షపాతం తక్కువగా, 92 శాతమే నమోదు కావొచ్చని అధికారులు అంచనాలు వివరించారు. ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంలోని వర్షాధారిత ప్రాంతాలపై తీవ్రంగా పడే అవకాశం ఉందని, ముఖ్యంగా అనంతపురం, సత్యసాయి, కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో వానలు తగ్గొచ్చన్నారు. ఇది పప్పుధాన్యాలు, నూనెగింజలు, నీటి ఆధారిత ఉద్యాన పంటలపై ప్రభావం చూపిస్తుందని అభిప్రాయపడ్డారు. ఎల్‌నినో నివారణ చర్యల్లో భాగంగా పీఎండీఎస్ (గ్రతీవ-వీశీఅంశీశీఅ ఐతీఎ రాశీషఐఅస్త్ర) విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. వర్షాలకు ముందే విత్తనాలు వేసే పీఎండీఎస్ విధానంతో రైతులకు అధిక దిగుబడి రావడంతో పాటు ఖర్చు, ఎరువులు, నీటి వనరులు వినియోగం తగ్గుతుందన్నారు. దీంతో ఎకరాకు రూ. 5,000 నుంచి రూ. 7,000 వరకు రైతులు అదనపు ఆదాయం పొందుతారని చెప్పారు. ఈ ఏడాది 20 లక్షల ఎకరాల్లో దీనిని అమలు చేసేలా చూడాలని సీఎం సూచించారు. దీనిని వీబీ జీ రామ్ జీతో అనుసంధానించే అంశాన్ని పరిశీలించాలన్నారు.

**అన్ని గ్రామాల్లో ప్రకృతి సాగుకు ప్రణాళికలు :** 2025-26లో 4,116 గ్రామ పంచాయతీల్లో 17.74 లక్షల రైతులు 9.26 లక్షల హెక్టార్లలో ప్రకృతి సాగు చేశారని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. అయితే 2026-27లో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి ముఖ్యమంత్రి భారీగా లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ ఏడాది మొత్తం 13,300 గ్రామ పంచాయతీలకూ ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని... 25 లక్షల రైతులు, 11 లక్షల హెక్టార్లలో సాగు చేసేలా చూడాలన్నారు.

**ఆర్ఎస్కే ఇంటిలిజెన్స్ హబ్ డ్యాష్ బోర్డ్:** రాష్ట్రంలోని రైతు భరోసా కేంద్రాల పనితీరును, వ్యవసాయ రంగ సమాచారాన్ని పర్యవేక్షించేలా రూపొందించిన ఆర్ఎస్కే ఇంటిలిజెన్స్ హబ్ డ్యాష్ బోర్డ్ గురించి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇది ముఖ్యంగా రైతులకు సేవలను మెరుగుపరచడమే కాకుండా, విత్తనాలు-ఎరువుల సరఫరా, పంటల వివరాలను, ఇ క్రాంపింగ్, పంటల బీమా తదితర వివరాలను డిజిటల్‌గా ట్రాక్ చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. రైతులు తమ ఆర్డర్లు, స్టాక్ వివరాలను లైవ్ డ్యాష్‌బోర్డ్‌లో చూసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ఈ డ్యాష్ బోర్డులో కచ్చితమైన సమాచారం రియల్ టైమ్‌లో అప్డేట్ అయ్యేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు.

## సింగపూర్ అభివృద్ధి, పారిశ్రామిక, సాంకేతిక విధానాల అధ్యయనం

- **రాష్ట్రంలో సింగపూర్ విధానాలు అమలు చేసేందుకు అధ్యయనం చేస్తున్న మంత్రులు**
- **సింగపూర్‌లో ఏపీ మంత్రుల 4వ రోజు పర్యటన విజయవంతం**



సింగపూర్ (జర్నలిస్ట్ ఫైల్) :సింగపూర్‌లో కొనసాగుతున్న అధ్యయన పర్యటనలో భాగంగా నాలుగో రోజు కార్యక్రమాలు "ప్రజా బాధ్యత, స్థిరమైన ప్రజా నమ్మకం, జల వనరుల నిర్వహణ" అనే అంశాలపై విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఉదయం సింగపూర్ కోఆపరేషన్ ఎంటర్‌ప్రైజ్‌లో నిర్వహించిన సమావేశంలో గత రోజు అంశాలపై సమీక్ష నిర్వహించగా, డాక్టర్ ప్రేమ్ కుమార్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. అనంతరం "నేషన్ ఫస్ట్" నుంచి "వియ్ ఫస్ట్" దిశగా మార్పు, ప్రజలు-ప్రభుత్వం-ప్రైవేట్ రంగాల సమన్వయం, పనితీరు ఆధారంగా నమ్మకం నిర్మాణం, సమర్థమైన ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు వంటి కీలక అంశాలపై చర్చ జరిగింది. ఈ సెషన్‌లో మాజీ మంత్రి లిమ్ స్వీ సే ప్రసంగిస్తూ, సమర్థవంతమైన పాలన ద్వారా దీర్ఘకాలిక ప్రజా నమ్మకాన్ని ఎలా నిర్మించాలో వివరించారు. ప్రభుత్వ వ్యవస్థలో సమన్వయం, బాధ్యతాయుత వైఖరి, పారదర్శకత వంటి అంశాల ప్రాముఖ్యతను ఆయన వెల్లడించారు. మధ్యాహ్నం "Singapore'ం Water Story" పై నిర్వహించిన సెషన్‌లో సింగపూర్ జల వనరుల నిర్వహణ, నీటి సంరక్షణ, ఆధునిక సాంకేతికత వినియోగంపై మంత్రుల బృందానికి నిపుణులు వివరించారు. అనంతరం NUS Cities కు చెందిన డాక్టర్ ఎం. ఖూ టెంగ్ చై మార్గదర్శకత్వంలో మారినా బ్యారేజ్ ను సందర్శించారు. మారినా బ్యారేజ్ వద్ద నీటి నిల్వ, వరద నియంత్రణ, శుద్ధి విధానాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలను మంత్రులు ప్రత్యక్షంగా పరిశీలించారు. సమగ్ర జల వనరుల నిర్వహణలో సింగపూర్ అనుసరిస్తున్న విధానాలు మంత్రులకు ప్రేరణనిచ్చాయి.

ఈ అధ్యయన పర్యటన ద్వారా ప్రజా నమ్మకం పెంపు, బాధ్యతాయుత పాలన, ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలలో సింగపూర్ అనుభవాలను అవగాహన చేసుకుని, వాటిని మన రాష్ట్రంలో అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రుల బృందం తెలిపింది. మంత్రుల బృందంలో పి. నారాయణ, వంగలపూడి అనిత, కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, బి.సి జనార్దన్ రెడ్డి, APSDPS ED ఆలపర్తి వెంకటేశ్వరరావు ఉన్నారు.

## దీదీ దిగిపోయే సమయం వచ్చింది



**పశ్చిమ బెంగాల్( జర్నలిస్ట్ ఫైల్):** పశ్చిమబెంగాల్‌లో జరిగిన తొలి దశ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పందిస్తూ.. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని దీంతో స్పష్టమైందన్నారు. ఇక, దీదీ (సీఎం మమతా బెనర్జీని ఉద్దేశిస్తూ) దిగిపోయే సమయం ఆసన్నమైందన్నారు. కోల్‌కతాలో జరిగిన విలేకరుల సమావేశంలో అమిత్‌షా ఈ వ్యాఖ్యలు చేశారు.

తొలి దశలో భాగంగా 152 సీట్లకు పోలింగ్ జరగ్గా.. అందులో 110కి పైగా స్థానాల్లో భాజపా విజయం సాధిస్తుందని కేంద్ర మంత్రి ధీమా వ్యక్తం చేశారు. 'మాకు అందిన సమాచారం ప్రకారం.. బెంగాల్ ప్రజలు తమ భవిష్యత్తును తొలి దశలోనే నిర్ణయించుకున్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని అభివృద్ధికి వారు మొగ్గు చూపారు. తొలిదశ పోలింగ్ చూస్తే.. దీదీ దిగిపోయే సమయం వచ్చిందని, భాజపా అధికారాన్ని చేపట్టనుందనేది స్పష్టమవుతుంది' అని అమిత్‌షా అన్నారు. భాజపా అధికారంలోకి వస్తే.. పశ్చిమ బెంగాల్‌లో భయానక పాలనను అంతం చేస్తామని అమిత్‌షా పేర్కొన్నారు. చట్టబద్ధమైన పాలనను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. మార్పు అంటే.. చొరబాటు రహిత బెంగాల్‌గా మార్చడమేనన్నారు. అవినీతి, బుజ్జగింపులు, దోపిడీల నుంచి స్వేచ్ఛ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమన్నారు. ప్రభుత్వ ఏర్పాటు తర్వాత మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు.

**అవన్నీ వదంతులే.. :** బెంగాల్‌లో భాజపా అధికారంలోకి వస్తే.. పాలన బయట నుంచి ఉంటుందంటూ మమతా బెనర్జీ వదంతులు వ్యాపింపజేస్తున్నారని విమర్శించారు. 'దీదీ గారు.. మీకు ఒకటి చెప్పాలి. ఇక్కడే పుట్టి, బెంగాలీలో చదువుకుని, ఆ భాషను మాట్లాడగలిగేవారే.. బెంగాల్‌లో తర్వాతి సీఎం అవుతారు. అయితే, అది మీ మేనల్లుడు (అభిషేక్ బెనర్జీని ఉద్దేశిస్తూ) కాదు. ఆ ముఖ్యమంత్రి ఒక భాజపా కార్యకర్త' అని అమిత్‌షా అన్నారు.

## మంగళగిరిలో నేడు, రేపు ఐపీఎల్ ఫ్యాన్ పార్క్








- **జూన్ 5 నుంచి ఆంధ్రా ప్రీమియర్ లీగ్**
- **రాజ్యసభ సభ్యులు ఎంపీ సానా సతీష్ బాబు**

మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్):క్రికెట్ అభిమానులకు ప్రత్యేకంగా మంగళగిరిలో రెండు రోజుల పాటు ఐపీఎల్ ఫ్యాన్ పార్క్‌ను నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యులు ఎంపీ సానా సతీష్ బాబు తెలిపారు. బీసీసీఐ ఆధ్వర్యంలో మంగళగిరి టిడ్కో సముదాయం ఎదుట ఈ ఫ్యాన్ పార్క్ ప్రాంగణంలో శుక్రవారం మీడియా సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఫ్యాన్ పార్క్‌లో మొత్తం నాలుగు మ్యాచ్‌లను అభిమానులు ఉచితంగా ప్రత్యక్ష ప్రసారం ను వీక్షించే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. రేపు దిల్లీ - పంజాబ్, రాజస్థాన్ - హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లు ప్రదర్శించబడతాయి. ఎల్లుండి గుజరాత్ - చెన్నై, లఖ్‌నవూ - కోల్‌కతా జట్ల మధ్య మ్యాచ్‌లు ప్రసారం చేయబడతాయని చెప్పారు. స్టేడియంలో ప్రత్యక్షంగా మ్యాచ్ వీక్షిస్తున్న అనుభూతిని ప్రేక్షకులకు అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఫ్యాన్ పార్క్ కార్యక్రమాలు స్టార్ స్పోర్ట్స్‌లో కూడా ప్రత్యక్ష ప్రసారం అవుతాయని తెలిపారు. మంత్రి నారా లోకేష్ చొరవతో ఈ కార్యక్రమం నిర్వహణ సాధ్యమైందని ఎంపీ పేర్కొన్నారు. అలాగే, మంగళగిరి ప్రీమియర్ లీగ్‌లో 120 జట్లు పాల్గొనడం విశేషమని చెప్పారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంకా, మంగళగిరి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జూన్ 5 నుంచి ఆంధ్రా ప్రీమియర్ లీగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మంగళగిరిని అన్ని రకాల క్రీడలకు వినూత్న కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీ సానా సతీష్ బాబు స్పష్టం చేశారు. అనంతరం బీసీసీఐ ఆపరేషన్స్ మేనేజర్ ఆల్విన్ గైక్వాడ్ తో కలసి టీ షర్టులను ఆవిష్కరించారు.

## నేడు ఎస్.సి, ఎస్.టి, దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ఎస్.సి, ఎస్.టి, దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ నేడు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎస్ఆర్ శంకరన్ సమావేశం మందిరంలో ఎస్.సి, ఎస్.టి, దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ జరుగుతుందని చెప్పారు. ఎస్.సి, ఎస్.టి, దివ్యాంగ అభ్యర్థులు తమ సమస్యలను విన్నవించవచ్చని ఆయన చెప్పారు.

# మలేరియా రహిత జిల్లాలుగా బాపట్ల, పశ్చిమగోదావరి, కోనసీమ

- **త్వరలో కేంద్రానికి ప్రతిపాదనలు**
- **2024-25 నుంచి రాష్ట్రంలో తగ్గుముఖం పట్టిన మలేరియా కేసులు**
- **రాబోయే వర్షాలు దృష్టిలో పెట్టుకుని ఇప్పటినుంచే క్రిమిసంహారక మందు పిచికారీ**
- **రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**
- **రేపు ప్రపంచ మలేరియా దినోత్సవం**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో మలేరియా జ్వరాల నియంత్రణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇందులో భాగంగా బాపట్ల, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాలను మలేరియా రహిత జిల్లాలుగా ప్రకటించేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపబోతున్నామని ప్రకటించారు. 2024-25 నుంచి మలేరియా జ్వరాల కేసులు రాష్ట్రంలో తగ్గుతూ వస్తున్నాయని తెలిపారు. 2024-25లో 7,871 మలేరియ కేసులు రాగా, 2025-26లో 7,199 కేసులు నమోదయ్యాయన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు (16 వారాలు) 899 కేసులు నమోదైనట్లు చెప్పారు. కిందటేడాది ఇదే సమయంలో 1,783 కేసులు వచ్చాయన్నారు. 2030 నాటికి మలేరియా కేసులు గణనీయంగా తగ్గించేందుకు పకడ్బందీగా రూపొందించిన ప్రణాళికలకు అనుగుణంగా చర్యలు చేడుతున్నామని తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం (శనివారం-ఏప్రిల్ 25) పురస్కరించుకుని మంత్రి నేడొక ప్రకటన జారీచేశారు.

**వర్షాలు పురస్కరించుకుని దోమల వ్యాప్తి నిరోధక 'స్ప్రే' కార్యక్రమాలు :** రాబోయే వర్షాలు దృష్టిలో ఉంచుకుని 'ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రే' కార్యక్రమాన్ని చేబట్టబోతున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇళ్లల్లోని గోడలు, పైకప్పు భాగంలో క్రిమి సంహారక మందును స్ప్రే చేయడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టేందుకు వీలవుతుందని వెల్లడించారు. క్రిమిసంహారక మందు కొనుగోలు, పిచికారీ, ఇతర ఖర్చుల కింద కలిపి ఏడాదికి రూ. 10 కోట్ల వరకు వ్యయం చేస్తున్నామని తెలిపారు. మలేరియా జ్వరాల కేసులు అధికంగా ఉండే ముఖ్యంగా గిరిజన ప్రాంతాలైన అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పోలవరం జిల్లాల్లో 'స్ప్రే' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సదరు ప్రాంతాల భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా 'స్ప్రే' కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు అనుసరించి చేపట్టామని తెలిపారు. ఇవి కాకుండా ఎంపికచేసిన మరో 13 జిల్లాల్లోనూ మే 15 నుంచి దశల వారీగా ప్రారంభించి, ఆగస్టు 30 నాటికి 'స్ప్రే' కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ 13 జిల్లాల్లో శ్రీకాకుళం, విజయనగరం, ప్రకాశం, మర్కాపురం, నంద్యాల, అన్నమయ్య, శ్రీ సత్యసాయి, విశాఖపట్నం, ఏలూరు, మన్యం, ఎన్టీఆర్, తిరుపతి, చిత్తూరు జిల్లాలున్నాయి. ఈ స్ప్రే కార్యక్రమ నిర్వహణకు రూ. 4.5 కోట్లు, పిచికారి మందు కొనుగోలు కోసం రూ. 4.80 కోట్ల వరకు (అల్ఫా సైపర్ మెత్రిన్, మలాథియాన్ మందు ) ఖర్చు పెడుతున్నామన్నారు. ఇతర ఖర్చుల కింద కలిపి మొత్తం రూ. 10 కోట్ల వరకు వ్యయం చేస్తున్నామని మంత్రి వివరించారు.

**ప్రతి వెయ్యి జనాభాలో రెండు కేసులు నమోదైన గ్రామాల్లో 'స్ప్రే' :** ప్రతి వెయ్యి జనాభాలో రెండు కేసులు నమోదైన గ్రామాల్లో ఈ స్ప్రే కార్యక్రమాన్ని చేబడుతున్నామని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ క్రమంలోనే బాపట్ల, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాలను మలేరియా రహిత జిల్లాలుగా ప్రకటించేందుకు అవసరమైన ప్రతిపాదనలను కేంద్రానికి పంపనున్నట్లు తెలిపారు. ఈ జిల్లాల్లో వరుసగా మూడేళ్ల నుంచి కేసులు నమోదుకాలేదని, బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారి ద్వారా మలేరియా కేసులు బయటపడ్డాయన్నారు. మలేరియా రహిత జిల్లాలుగా ప్రకటించేందుకు పంపాల్సిన ప్రతిపాదనలు ఎలా ఉండాలి? ఎటువంటి ఆధారాలు సమర్పించాలన్న దానిపై కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, అధికారులకు శిక్షణ ఇచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చేనెల వెళ్లే ప్రతిపాదనలు అనుసరించి, కేంద్ర బృందం ఈ మూడు జిల్లాల్లో పర్యటిస్తుందని తెలిపారు. నిశిత పరిశీలన అనంతరం కేంద్ర ప్రభుత్వం 'మలేరియా ఎలిమినేషన్'పై ప్రకటన చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి వెయ్యి మందిలో 0.15 చొప్పున కేసులు వస్తున్నాయి. ప్రతి వెయ్యి మంది జనాభాకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో 3.46, పార్వతీపురం మన్యం జిల్లాలో 1.95 చొప్పున కేసులు ఉన్నాయి.

ఇప్పటికే రాష్ట్రంలో దోమల తెరల పంపిణీని ప్రారంభించామని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇప్పటివరకు అల్లూరి సీతారామరాజు, పోలవరం, మన్యం జిల్లాల్లో పంపిణీ పూర్తయ్యే దశలో ఉందని పేర్కొన్నారు. మొత్తమ్మీద రాష్ట్ర వ్యాప్తంగా 1.95 లక్షల కుటుంబాలు, విద్యార్థుల వసతి గృహాలకు అందచేసే 2.55 లక్షల దోమ తెరలను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మలేరియా జ్వరాలు, దాని ప్రభావం, తీసుకోవల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ఆసుపత్రుల్లో ఉన్న వైద్య సేవల వినియోగం తెలియచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# వివిఐటియులో "మేధో సంపత్తి హక్కుల" పై సదస్సు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్ డే ను పురస్కరించుకుని వివిఐటి విశ్వవిద్యాలయం నందు "ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ అండ్ హైయ్యర్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్" అనే సదస్సును నిర్వహించారు. మేధో సంపత్తి హక్కులు (పేటెంట్, ట్రేడ్‌మార్క్, కాపీరైట్) ఎంత కీలకమైనవో, అవి కొత్త ఆవిష్కరణలను మరియు సృజనాత్మకతను ఏ విధంగా ప్రోత్సహిస్తాయో తెలియజేయడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని వివిఐటియు ప్రో-ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా మేధో సంపత్తి నిపుణుడు, రిజిస్టర్డ్ పేటెంట్ ఏజెంట్ విజయ్ కుమార్ మక్యం హాజరయ్యారు. విశ్వవిద్యాలయాలు మరియు కళాశాలలు కేవలం జ్ఞానాన్ని పంచడమే కాకుండా కొత్త ఆవిష్కరణలకు వేదికలుగా మారాలని విజయ్ కుమార్ సూచించారు. మనిషి తన మేధస్సుతో సృష్టించిన ఆలోచనలు, ఆవిష్కరణలకు తప్పనిసరిగా చట్టబద్ధమైన హక్కులను పొందాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు తమ పరిశోధనలలోని నవీనతను గుర్తించి, పరిశోధనా పత్రాలను పబ్లిష్ చేసే ముందే పేటెంట్ హక్కులు పొందాలని తెలిపారు. మేధో సంపత్తి హక్కులు విద్యార్థులు మరియు ప్రొఫెసర్లు చేసే పరిశోధనలను ఇతరులు అనుకరించకుండా రక్షణ కల్పిస్తాయని వివరించారు. పేటెంట్ల ద్వారా ఆవిష్కరణలను వాణిజ్యీకరణ చేసి ఆదాయం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. అనంతరం విజయ్ కుమార్ ను ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిఐటియు రిజిస్ట్రార్ డా. వై. మల్లికార్జున రెడ్డి, అకడమిక్ డీన్ డా. కె.గిరిబాబు, డైరెక్టర్ సీమన్స్ సిఓఈ డా. రావెల నవీన్, డిప్యుటి రిజిస్ట్రార్ డా.కె.ఐ. పవన్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# గుంటూరులో అమృత్ పథకం పనులు పరిశీలన

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంలో అమృత్ పథకం క్రింద జరిగిన అభివృద్ధి పనులను అమృత్ డిప్యుటీ సెక్రటరీ గ్రేస్ లాల్ రెండికి పచావ్ ఐ.ఎ.యస్ పరిశీలించారు. ఈ సందర్భంగా నగర పరిధిలో అమృత్ పథకం క్రింద అంకిరెడ్డి పాలెం చెరువు మరియు కొరిటపాడు చెరువు లలో జరిగిన వివిధ అబివృద్ధి పనులను శుక్రవారం నగర పాలక సంస్థ అధికారులతో కలిసి కేంద్ర అమృత్ బృందం పర్యటించి తనిఖీ చేశారు.

గుంటూరు నగరంలో అమృత్ పథకం క్రింద త్రాగు నీటి కుళాయిల ఏర్పాటు, పార్కులు మరియు చెరువు అభివృద్ధి పనులను నిర్వహించగా, సదరు పనులను పరిశీలించుటకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ అమృత్ పథకం నుండి శుక్రవారం నగరానికి కేంద్ర బృందం నగరానికి వచ్చింది. సదరు బృందం 3.50 కోట్లతో అభివృద్ధి చేసిన అంకిరెడ్డి పాలెం చెరువును మరియు 3.70 కోట్లతో అభివృద్ధి చేసిన కోరిటపాడు చెరువులను పరిశీలించి, సదరు చెరువు అభివృద్ధి పనులను చూసి కేంద్ర బృందం సంతృప్తి చెంది, కొరిటపాడు పాడు చెరువు వద్ద గల డ్రైన్ వాటర్ ను శుద్ధి చేసి, మరల సదరు నీటిని చెరువులోకి మరల్చుటకు 70 లక్షలు అదనంగా నిధులు మంజూరు చేసి, పనులను వెంటనే ప్రారంభించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

సదరు పర్యటనలో యస్. ఈ జి. వెంకటేశ్వర రావు, ఎ.పి.యు.యఫ్.ఐ.డి.సి ఇంజనీరింగ్ అధికారులు, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వాలీబాల్ లీగ్-4లో ఉత్కంఠభరిత పోటీలు

- మంత్రి నారా లోకేష్ సహకారంతో ఘనంగా కొనసాగుతున్న టోర్నమెంట్
- ఆరు మ్యాచ్‌ల్లో జట్ల మధ్య హోరాహోరీ పోరు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** తాడేపల్లి నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న మంగళగిరి వాలీబాల్ లీగ్-4 టోర్నమెంట్ ఐదవ రోజు కూడా అదే జోష్‌తో కొనసాగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలలో భాగంగా మంత్రి నారా లోకేష్ సహకారంతో ఈ లీగ్ నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా ఐదవ రోజు మొత్తం ఆరు మ్యాచ్‌లు నిర్వహించగా, ప్రతి మ్యాచ్‌లో జట్లు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి ప్రేక్షకులను అలరించాయి. మొదటి మ్యాచ్‌లో నూతక్కి స్టీవెన్ యూత్ చినకాకాని పై స్పార్టాన్స్ నవులూరు విజయం సాధించింది, రెండవ మ్యాచ్ లో డైనమిక్ ఎలైట్ తాడేపల్లి టౌన్ పై పోటీలో 6 వ ఏపీఎస్పీ బెటాలియన్ లయన్స్ జట్టు గెలుపొందింది, మూడవ మ్యాచ్‌లో , ఎవర్ గ్రీన్ యూత్ ప్రాతూరు జట్టు పై ఓల్డ్ మంగళగిరి యూత్ జట్టు విజయం సాధించింది. నాలుగవ మ్యాచ్‌లో ఏకే కింగ్స్ యూత్ ప్రకాష్ నగర్ జట్టు పై చిరు ఎఫ్సీ ఆత్మకూరు జట్టు గెలిచింది, ఐదవ మ్యాచ్‌లో డెక్కన్ చార్జర్స్ దుగ్గిరాల జట్టు పై న్యూ స్టార్స్ చినకాకాని జట్టు విజయం సాధించగా, ఆరో మ్యాచ్‌లో నిడమర్రు వారియర్స్ జట్టు పై శృంగారపురం స్పైకర్స్ జట్టు విజయం సాధించింది, క్రీడా స్ఫూర్తిని పెంపొందించే విధంగా ఈ లీగ్ విజయవంతంగా కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు.

పోటీలలో గెలుపొందిన విజేతలకు నారా లోకేష్ స్ఫూర్తితో ప్రథమ బహుమతి కింద లక్ష న్నర రూపాయలను అరవపల్లి శ్రీనివాసరావు , ద్వితీయ బహుమతి కింద లక్ష రూపాయలు కోగంటి ప్రసాద్ తృతీయ బహుమతి కింద 50 వేలు నగదును రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విన్నకోట శ్రీనివాసరావు ల సహకారంతో నగదు బహుమతులు అందించనున్నారు.

ఈవెంట్ స్పాన్సర్లు గా శ్రీ శ్రీనివాస కన్స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, తెనాలి డబల్ హార్స్ గ్రూప్, సిగ్నేచర్ డైన్, మంగళాద్రి డెవలపర్స్, సెలారా ఫైన్ జ్యూవెలరీ, మాన్విక్ హ్యాండీక్రాఫ్ట్స్, వ్యవహరించనున్నాయి. ప్రతి మ్యాచ్‌ను గోపీ టీవీ యూట్యూబ్ ఛానల్, వి డిజిటల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం నిరాంతరయంగా అందించడం జరుగుతుంది. టోర్నమెంట్ వాటర్ బాటిల్స్ స్పాన్సర్ గా జీ సత్యన్నారాయణ, ఫుడ్ స్పాన్సర్ గుత్త కిషోర్, స్నాక్స్ స్పాన్సర్ గా షేక్ రియాజ్ లు తమ సేవలను అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# డా॥ ఎన్.వి. సుందరాచారిని సత్కరించిన పౌర సంస్థలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** శిధిలా వ్యవస్థలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాలను దాతల సహకారంతోకేవలం సంవత్సర కాలంలోనే దాదాపు పది కోట్లకు పైగా విరాళాలను సేకరించి, ఆధునీకరించి, పునః నిర్మించడాన్ని అభినందిస్తూ ఈ నెల 24 వ తేదీన శుక్రవారం డా॥ యన్.వి. సుందరాచారిని ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా॥ ఆలా వెంకటేశ్వర్లు, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, గుంటూరు రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణ రెడ్డి లు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డా॥ ఆలా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ పూర్వ విద్యార్థుల సహకారంతో న్యూరాలజీ డిపార్ట్ మెంట్ ను కార్పొరేట్ హాస్పిటల్ స్థాయికి అభివృద్ధి చేయడంలో డా॥ యన్.వి. సుందరాచారి పాత్ర కీలకమైందన్నారు. 30 సంవత్సరాల తర్వాత గుంటూరు మెడికల్ కళాశాలలో మెడికల్ ఎగ్జిబిషన్ ను అద్భుతంగా నిర్వహించారని తెలిపారు. గతంలో పదవీ విరమణ తర్వాత డాక్టర్ కె.అంజి రెడ్డి గారి సేవలను ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏ విధంగా ఉపయోగించుకుందో అదే విధంగా నేడు కూడా పదవీ విరమణ అనంతరం డా॥ ఎన్.వి. సుందరాచారి సేవలను ఉపయోగించుకోవలసినది గా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారిని, రాష్ట్ర ఆరోగ్య శాఖ మాత్యులు సత్య కుమార్ యాదవ్ లకు విజ్ఞప్తి చేశారు. డా ॥ ఎన్.వి.సుందరాచారి లాంటి సమర్థత, నిజాయితీ, సేవా దృక్పథం గల వారిని ప్రోత్సహించవలసిన బాధ్యత ప్రభుత్వంపై, ప్రజలపై ఉందన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ డా॥ ఎన్.వి.సుందరాచారి 34 సంవత్సరాల వైద్య వృత్తిలో ఉండి న్యూరాలజీ ఫిజిషియన్ గా లక్షలాది రోగులకు అద్భుతమైన చికిత్స అందించారన్నారు. 1946లో ప్రారంభమైన గుంటూరు మెడికల్ కళాశాలను కార్పొరేట్ స్థాయి వైద్య కళాశాల స్థాయికి తీసుకొని రావడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఫెలో ఆఫ్ ది అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ, ఇంగ్లాండు కు చెందిన రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ సర్టిఫికెట్ ను పొందిన డా ॥ ఎన్.వి. సుందరాచారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్య విద్యలో ఉత్తమ అధ్యాపకునిగా అవార్డు అందించి సత్కరించిందన్నారు. 9.5 ఎకరాలలో నిర్మితమైన గుంటూరు మెడికల్ కళాశాలలో అన్ని వైద్య విభాగాలను ఆధునీకరించడం, గ్రంథాలయం ను, క్యాంటీను అభివృద్ధి చేయడం అన్ని విభాగాలల్లో ఎయిర్ కండిషన్స్ తోపాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంలో డాక్టర్ ఎన్.వి. సుందరాచారి కృషి మరవలేనిదన్నారు. వైద్య విద్యలో ఆంధ్రప్రదేశ్ లో ఆంధ్ర మెడికల్ కాలేజీ విశాఖపట్నం తర్వాత గుంటూరు మెడికల్ కళాశాల రెండవ స్థానంలో ఉందని, దేశవ్యాప్తంగా మొదటి 50 స్థానాలలో గుంటూరు మెడికల్ కాలేజీ ఉండే విధంగా డాక్టర్ ఎన్. వి సుందరాచారి కృషి చేస్తునారన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ తో కలిసి పక్షవాతంపై డాక్టర్ సుందరాచారి కీలక పరిశోధనలు చేశారన్నారు. డాక్టర్ సుందరాచారి కృషితో న్యూరాలజీ మెడికల్ సీట్లు గణనీయంగా పెరిగి తెలుగు రాష్ట్రాలలోని అత్యధిక పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లు గల మెడికల్ కళాశాల గా గుంటూరు మెడికల్ కళాశాల చేరిందన్నారు. డాక్టర్ సుందరాచారి స్వయంగా పౌర సంస్థల ప్రతినిధులను గుంటూరు మెడికల్ అన్ని విభాగాలను చూపిస్తూ, మెడికల్ కళాశాల అభివృద్ధి క్రమాన్ని వివరించారు.

# పక్కా ప్రణాళికలతో జి.ఎస్.టి లక్ష్యాలు సాధించాలి



- గుంటూరు జిల్లా కలెక్టర్ ఆదేశం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర జి.ఎస్.టి లక్ష్యాలను సాధించుటకు పక్కా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ అన్నారు. రాష్ట్ర జి.ఎస్.టి వసూళ్ల పెంపు పై వివిధ శాఖలతో సమన్వయ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు. ప్రభుత్వ పనులు పూర్తి చేసిన అనంతరం బిల్లులు అప్ లోడ్ చేసే సమయంలో జి.ఎస్.టి వివరాలపై సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

రాష్ట్ర జి.ఎస్.టి జాయింట్ కమిషనర్ గీతా మాధురి మాట్లాడుతూ గుంటూరు ఒకటవ డివిజన్ పరిధిలో ఆరు సర్కిల్ లు ఉన్నాయన్నారు. ఎస్.జి.ఎస్.టి లక్ష్యం రూ.134.33 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.109.43 కోట్లను సాధించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పనులు చేస్తున్న గుత్తేదారుల నుండి చెల్లింపులు సక్రమంగా జరగడం లేదని, ప్రభుత్వ పనులు జరుగుతున్న వివరాలు అందించాలని కోరారు. విద్యా శాఖ అధికారులు వివిధ ప్రైవేటు విద్యా సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు సమర్పించడం వలన పన్నుల వసూళ్లకు అవకాశం ఉంటుందన్నారు. రూ.15 వేలు కంటే ఎక్కువ వేతనం పొందుతున్న వారి నుండి వృత్తి పన్ను వసూలు చేయుటకు అవకాశం ఉందన్నారు.

ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి.హెచ్. కృష్ణ, ప్రజా ఆరోగ్య శాఖ పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాస్, ఎం.టి.ఎం.సి అదనపు కమిషనర్ శకుంతల, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పల నాయుడు, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ రమేష్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్ డి.శైలజ, జి.ఎస్.టి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతతో కూడిన అభివృద్ధి పనులే లక్ష్యం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంలో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిలోనూ నాణ్యత అత్యంత ప్రధానమని, నాణ్యత ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ రోడ్, చుట్టగుంట సెంటర్, కోదండరామయ్య నగర్, జిటి రోడ్, శాంతి నగర్, శ్రీనివాసరావుతోట, నల్లచెరువుల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులను, పెండింగ్ సమస్యలను పరిశీలించి సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అభివృద్ధి పనుల వల్ల సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా వివిధ విభాగాల మధ్య సరైన సమన్వయం ఉంటేనే పనులు వేగంగా మరియు సమర్థవంతంగా పూర్తి అవుతాయని స్పష్టం చేశారు. నిర్మాణ సామాగ్రి రోడ్ల పై రాకపోకలకు అడ్డుగా ఉంచవద్దన్నారు. పర్యటనలో ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఈఈ కళ్యాణరావు, డిఈఈలు వెంకటరమణ, శ్రీనివాస్, ఎస్ఎస్ సాంబయ్య, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# నీతి ఆయోగ్ నీరాజనం.. కూటమి పాలనలో పర్యాటక వికాసం..

- పర్యాటకానికి కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన ఆంధ్రప్రదేశ్!..
- సహజ సిద్ధ వైభవానికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్న కూటమి ప్రభుత్వం
- "సందర్శించండి స్వర్ణాంధ్రను.. ఆస్వాదించండి అడుగడుగునా ఆత్మీయ ఆతిథ్యాన్ని!" అంటున్న పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

ఒక దేశం యొక్క ఆత్మను తెలుసుకోవాలంటే ఆ దేశపు మారుమూల ప్రాంతాల అందాలను, సంస్కృతిని చూడాలంటారు. అదే స్ఫూర్తితో నీతి ఆయోగ్ విడుదల చేసిన 'దివ్య భారత్ - ఏ విండో టు ది సోల్ ఆఫ్ ఇండియా' నివేదికలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం ధ్రువతారలా మెరిసింది. "నిజమైన ప్రకృతి సౌందర్యాన్ని అనుభవించాలంటే ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సిందే" అని నీతి ఆయోగ్ ప్రశంసించడం రాష్ట్ర పర్యాటకానికి లభించిన అత్యున్నత గౌరవం. నిన్నటి వరకు కేవలం ఒక పర్యాటక ప్రాంతంగా ఉన్న ఆంధ్రప్రదేశ్, నేడు ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా రూపాంతరం చెందడం వెనుక ఒక గొప్ప సంకల్పం, దార్శనికత దాగి ఉంది. రాష్ట్రంలోని ప్రకృతి ప్రాంతాలు, ప్రసిద్ధ చారిత్రక కట్టడాలు, పురాతన కోటలు, సహజసిద్ధంగా ఏర్పడ్డ గుహలు, విశాల సముద్రతీరం, అధ్యాత్మిక ప్రాంతాలు, ప్రఖ్యాతి గాంచిన స్థానిక వంటకాలు, సంప్రదాయ వస్త్రాలు, హస్త కళాకృతులు, బౌద్ధారామాలు, పర్యాటక ఉత్సవాలు, ఘనమైన వారసత్వం తదితర విశేషాలను నీతి ఆయోగ్ తన 13 పేజీల నివేదికలో పేర్కొనడం, ఆంధ్రప్రదేశ్‌ను "ప్రకృతి ప్రేమికుల స్వర్గం"గా అభివర్ణించడం ఏపీ పర్యాటకానికి మరింత ఊతమిచ్చే అంశం. 2024 జూన్ లో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాతి నుండే పర్యాటకాన్ని కేవలం వినోదంగా కాకుండా, ఒక బలమైన ఆర్థిక వనరుగా మార్చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ గట్టిగా నిర్ణయించుకున్నారు. ఈ 'ముక్కోణపు పాలన'లో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం, నూతన పర్యాటక పాలసీ 2024-29 విడుదల చేయడం, ఆ పాలసీకి అనుబంధంగా మరిన్ని పాలసీలు విడుదల చేసి అమలు చేయడం అనేది ఈ విజయగాథలో కీలక మలుపు. అక్టోబర్ నుండి ఫిబ్రవరి వం-కు ఆంధ్రప్రదేశ్ ఒక స్వర్గధామంలా మారుతుందని నీతి ఆయోగ్ చేసిన సిఫార్సు, ప్రపంచ పర్యాటకులను ఇటువైపు మళ్లించే ఒక దిశానిర్దేశం.

నీతి ఆయోగ్ నివేదికలో ప్రకృతి ఒడిలో గడపాల్సిన ప్రాంతాల్లో అరకు వ్యాలీ, లంబసింగి, మారేడుమిల్లి, పాపికొండలు, కురుపాం అటవీ ప్రాంతాలు, దట్టమైన నల్లమల్ల అడవులు, హార్సిలీ హిల్స్, కొల్లేరు, పులికాట్ సరస్సు, అందమైన కోనసీమకు స్థానం కల్పించడం గొప్ప విషయం. ఆంధ్రా కాశ్మీర్'గా పిలవబడే లంబసింగి, కాఫీ తోటల సుగంధం నిండిన అరకు లోయ పర్యాటకులకు చల్లని అనుభూతినిస్తాయి. ఇక్కడి గిరిజన సంస్కృతి, 'ధింసా' నృత్యం ప్రత్యేక ఆకర్షణ. అంతేకాదు కేరళ బ్యాక్ వాటర్స్‌ను తలపించే కొబ్బరి తోటలు, గోదావరి పాయలతో ఈ ప్రాంతం 'ఆంధ్రా కేరళ'గా ప్రసిద్ధి చెందింది. గోదావరి నది పాయల మధ్య పాపికొండలపై పడవ ప్రయాణం ప్రతి పర్యాటకుడికి ఒక మరుపురాని అనుభవం. జీవితంలో ఒక్కసారైనా ఈ ట్రిప్ కు వెళ్లాల్సిందే.. ఇవన్నీ అనుభూతి చెందాలంటే ఆంధ్రా పర్యాటకాన్ని చూడాల్సిందే..

ఇక కొత్తపల్లి, రంప, తలకోన, ఎత్తిపోతల జలపాతాలు, కంభం చెరువు, అనకాపల్లి కోనం, తాటిపూడి రిజర్వాయర్లను తప్పక సందర్శించాలని చెప్పడం ఆయా ప్రాంతాలకు మరింత ఊరటనిచ్చే అంశం. ఇందులో తలకోన జలపాతం గిరిశిఖరాల నుండి జాలువారే పాలధారలా మెరుస్తుంటే.. ఎత్తిపోతల, కొత్తపల్లి, రంప జలపాతాలు ప్రకృతి చేసే జలశబ్దాల సంగీతంలా అలరిస్తాయి. కంభం చెరువు, తాటిపూడి రిజర్వాయర్లు నీలి ఆకాశాన్ని తన గుండెల్లో నింపుకున్న స్వచ్ఛమైన అద్దాల వలె ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తాయి.

కంబాలకొండ, కోరింగ మడ అడవులు, నేలపట్టు మరియు ఉప్పలపాడు పక్షి సంరక్షణ కేంద్రాలతో పాటు బొర్రా గుహలు, బెలూం గుహలు, ఉండవల్లి, మొగల్రాజపురం, ఉదయగిరి గుహలను నీతి ఆయోగ్ తన నివేదికలో పర్యాటకుడు ఈ ప్రాంతాలను తప్పక చూడాలి అని పేర్కొంది. గండికోట (గ్రాండ్ కాన్యన్ ఆఫ్ ఇండియా), కొండపల్లి కోట, చంద్రగిరి, గుత్తి కోటలు వంటి చారిత్రక, సాహస యాత్రలను గుర్తించడం విశేషం. కోరింగ మడ అడవులు సముద్రపు అంచున పచ్చని కవచంలా నిలిచి పర్యావరణానికి ప్రాణం పోస్తుంటే.. నేలపట్టు, ఉప్పలపాడు కేంద్రాలు విదేశీ విహంగాల కిలకిలారావాలతో పక్షుల పండగను తలపిస్తాయి. కంబాలకొండ అడవులు అడవి బిడ్డలైన జంతుజాలానికి సురక్షితమైన నీడను, మనకు ప్రశాంతతను అందిస్తాయి. బొర్రా, బెలూం గుహలు భూమాత గర్భంలోని రహస్య కళాఖండాలైతే.. గండికోట లోయలు సాహసానికి చిరునామాగా నిలిచే భారతీయ అద్భుతం. కొండపల్లి, చంద్రగిరి, గుత్తి కోటలు శతాబ్దాల వీరగాథలను వినిపించే మౌన సాక్ష్యాలుగా, గంభీరమైన చారిత్రక శిఖరాలుగా దర్శనమిస్తాయి.

రుషికొండ, సూర్యలంక, కొత్తపట్నం బీచ్‌లు, ఎర్రమట్టి దిబ్బలు, కాకినాడ హోప్ ఐల్యాండ్ మరియు గిన్నీస్ రికార్డులో నిలిచిన 5 శతాబ్దాల నాటి తిమ్మమ్మ మర్రిమానును పేర్కొనడం వాటి ప్రాముఖ్యతను తెలుపుతున్నాయి. ముఖ్యంగా రుషికొండ, సూర్యలంక బీచ్‌లలో అలల తాకిడి మనసును పులకరింపజేస్తుంటే.. ఎర్రమట్టి దిబ్బలు కాలం చేసిన అరుదైన చిత్రలేఖనంలా ఆశ్చర్యపరుస్తాయి. అయిదు శతాబ్దాల తిమ్మమ్మ మర్రిమాను భూమిపై పచ్చని పందిరిలా విస్తరించి, ప్రకృతికి మరణంలేదని చాటిచెబుతుంది. ఇందులో రుషికొండ బీచ్ బ్లూఫ్లాగ్ బీచ్ గా గుర్తింపు పొంది అంతర్జాతీయ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ప్రస్తుతం సూర్యలంక బీచ్ కు కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ ద్వారా దాదాపు రూ.100 కోట్ల నిధులు కేటాయించగా దీన్ని ఆంధ్రాగోవాగా తీర్చిదిద్దుతోంది ప్రభుత్వం.

ఇక తిరుమల వేంకటేశ్వరస్వామి, శ్రీశైలం, విజయవాడ కనకదుర్గమ్మ, అన్నవరం, సింహాచలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, విశాఖ అప్పికొండ శ్రీ సోమేశ్వర ఆలయం, పాలకొల్లు క్షీరారామ క్షేత్రం, మహానంది, యాగంటి, పరిటాల ఆంజనేయ స్వామి, రామతీర్థం, శ్రీముఖ లింగం వంటి అధ్యాత్మిక క్షేత్రాలకు, లేపాక్షి ఆలయం, అమరావతి మహాచైత్యం, బావికొండ బౌద్ధ స్మారకాలు, కడప పెద్ద దర్గా, నెల్లూరు బారా షాహిద్ దర్గా, గుంటూరు జేఎం బాప్టిస్ట్ చర్చి మరియు చేబ్రోలు చర్చి వంటి వారసత్వ కట్టడాలకు, రాజమహేంద్రవరం రైల్వే వంతెన, కోనసీమ దిండి, కృష్ణా నది, వేంకటేశ్వర నేషనల్ పార్క్, ఓర్వకల్లు రాక్ గార్డెన్ మరియు కదిరి క్షేత్రంలకు చిరునామ ఏపీ అని సాక్షాత్తు నీతిఆయోగ్ పేర్కొనడం శుభపరిణామం. తిరుమల, శ్రీశైలం, కనకదుర్గమ్మ క్షేత్రాలు కోట్లాది భక్తుల నమ్మకానికి ప్రాణవాయువులైతే.. లేపాక్షి, అమరావతి కట్టడాలు మానవ నైపుణ్యం దైవత్వంతో చేసిన సంభాషణలా మెరుస్తాయి. చర్చిలు, దర్గాలు, బౌద్ధారామాలతో ఆంధ్రప్రదేశ్ సర్వమత సామరస్యానికి వేదికగా నిలిచి, భక్తిని ఒక జీవన విధానంగా మారుస్తోంది. రాజమహేంద్రవరం రైల్వే వంతెన గోదావరిపై ఇంజనీరింగ్ అద్భుతమైతే.. కోనసీమ దిండి పడవల ప్రయాణం ఒక కలలాంటి అనుభూతినిస్తుంది. ఓర్వకల్లు రాక్ గార్డెన్ శిలల విన్యాసంతో, కృష్ణా నది గంభీరమైన ప్రవాహంతో ఆంధ్రప్రదేశ్ పర్యాటకానికి పరిపూర్ణతను చేకూరుస్తున్నాయి.

అదే విధంగా ఏపీకి వస్తే కేవలం పర్యాటక ప్రాంతాలనే కాకుండా, ఇక్కడి ఆత్మీయ ఆతిథ్యాన్ని, పులిహోర, పూతరేకులు, కాజా, పెసరట్టు, గోంగూర పచ్చడి, ఉలవచారు, బొబ్బట్లు, రాగి సంగటి, ఆంధ్రా చికెన్ కర్రీ, చేపల పులుసు, గుత్తి వంకాయ మరియు అరిసెలు వంటి రుచులను జాతీయ స్థాయిలో ప్రమోట్ చేయడం ద్వారా పర్యాటకులను ఆకర్షించడంలో ప్రభుత్వం సఫలీకృతమైంది. ఏపీకి వస్తే వీటిని తినాల్సిందే..వాటి రుచి చూడాల్సిందే అని నీతిఆయోగ్ పేర్కొనడం ఆయా వంటకాలకు ప్రపంచ గుర్తింపు తెచ్చినట్లే..మంగళగిరి, వెంకటగిరి, ఉప్పాడ జామ్దానీ, కలంకారీ చీరలు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, నరసాపురం లేస్ మరియు బుడితి మెటల్ క్రాఫ్ట్ వైభవాన్ని ఈ నివేదిక ప్రపంచానికి చాటిచెప్పింది. తిరుమల బ్రహ్మోత్సవాల భక్తి పారవశ్యం..వేంకటేశుని దివ్యమంగళ రూపం, లేపాక్షి శిల్పాల సాక్షిగా.. ప్రాచీన కళల వైభవం ఈ చారిత్రక రూపం, సాగరతీరాన విశాఖ ఉత్సవం.. బుద్ధుని అడుగుజాడల లుంబిని ప్రకాశం, పచ్చని పైర్ల మధ్య పల్లెటూరి వికాసం ప్రతిబింబించేలా కోనసీమ సంక్రాంతి సంబరం, ఫ్లెమింగో విహంగాల విన్యాసం.. హస్తకళల సౌందర్యపు అద్భుత సమ్మేళనం.. ఇలా ఆంధ్రప్రదేశ్ అంటే కేవలం ప్రదేశాల సమాహారం కాదు, అడుగడుగునా సాగే ఒక ఉత్సవం అని నీతిఆయోగ్ చాటి చెప్పింది. నీతి ఆయోగ్ గుర్తించినట్లుగా, ఇక్కడి పండుగలు పర్యాటకులకు ఒక సరికొత్త లోకాన్ని పరిచయం చేస్తాయనడంలో అతిశయోక్తి లేదు. ప్రత్యేకించి తిరుమల కొండలపై జరిగే బ్రహ్మోత్సవాలు భక్తికి, కళలకు నిలయాలు. వాహన సేవల్లో ప్రతిబింబించే వైభవం, వేలమంది భక్తుల గోవింద నామస్మరణ మధ్య సాగే ఈ ఉత్సవం ఆంధ్రప్రదేశ్ ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రపంచ శిఖరాగ్రాన నిలబెడుతుంది. ఇక రాతి శిల్పాలకు ప్రాణం పోసిన లేపాక్షిలో జరిగే ఉత్సవాలు విజయనగర సామ్రాజ్య వైభవాన్ని గుర్తుచేస్తాయి. అలాగే, బౌద్ధ సంస్కృతిని చాటిచెప్పే లుంబిని ఉత్సవాలు శాంతికి, జ్ఞానానికి చిహ్నాలుగా నిలుస్తూ చరిత్ర ప్రేమికులను ఆకర్షిస్తాయి. ఆంధ్రుల అసలైన ఆత్మీయత సంక్రాంతి సంబురాల్లో కనిపిస్తుంది. పచ్చని కోనసీమలో హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, కోడి పందాలు, మరియు భోగి మంటల వెలుగులు పర్యాటకులకు స్వచ్ఛమైన పల్లెటూరి అనుభూతిని పంచుతాయి. నీలి రంగు సముద్ర తీరాన, రంగురంగుల విద్యుత్ దీపాల కాంతుల్లో జరిగే విశాఖ ఉత్సవం ఆధునికతకు, సంప్రదాయానికి వారధి. ఇది యువతను, సాహస క్రీడాకారులను అలరించే ఒక అద్భుత వేదిక. వేల మైళ్ల దూరం నుండి వచ్చే విదేశీ విహంగాల విన్యాసం 'ఫ్లెమింగో ఫెస్టివల్' అయితే, చేతివృత్తుల వారి నైపుణ్యాన్ని చాటిచెప్పే 'దక్షిణ హస్త కళా మేళా' మన వారసత్వ సంపదకు నిలువుటద్దం. ఈ ఉత్సవాలన్నీ కలిపి ఆంధ్రప్రదేశ్‌ను ఒక సజీవమైన, నిరంతరం వేడుకలు జరుపుకునే పర్యాటక స్వర్గధామంగా తీర్చిదిద్దుతున్నాయి. ఇవే గాక మరిన్ని పర్యాటక ప్రాంతాలు, ఇతర అంశాలకు జాబితాలో చోటు దక్కింది.. ఈ ప్రాంతాలన్నింటినీ అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడం ద్వారా, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

నీతిఆయోగ్ నివేదిక నేపథ్యంలో ఈ ప్రాంతాలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. కేవలం ప్రాంతాలనే కాకుండా, ఏపీలోని ఆత్మీయ ఆతిథ్యాన్ని, స్థానిక రుచులను జాతీయ స్థాయిలో ప్రమోట్ చేయడం ద్వారా పర్యాటకులను ఆకర్షించడంలో కూటమి ప్రభుత్వం సఫలీకృతమైంది. అంతేగాక తిరుమల నుండి శ్రీశైలం వరకు, అమరావతి బౌద్ధారామాల నుండి లేపాక్షి శిల్పకళ వరకు ఉన్న ఆధ్యాత్మిక వైభవాన్ని ఈ నివేదిక ప్రపంచానికి చాటిచెప్పడం, ఏయే నెలల్లో ఏ ప్రాంతాలను సందర్శించాలో నీతి ఆయోగ్ స్వయంగా సిఫార్సు చేయడం రాష్ట్ర పర్యాటక శాఖ పనితీరుకు దక్కిన గౌరవం. ఈ విజయం ఊరికే రాలేదు. మెరుగైన ఎక్స్‌ప్రెస్‌వేలు మరియు పర్యాటక ప్రాంతాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో వసతుల కల్పన వంటి చర్యలు పర్యాటకుల నమ్మకాన్ని పెంచాయి. పర్యాటక రంగానికి ఇండస్ట్రియల్ స్టేటస్ ఇవ్వడం వల్ల పెట్టుబడులు భారీగా పెరిగాయి, ఇది ఉద్యోగ ఉపాధి అవకాశాలను సృష్టించింది. నీతి ఆయోగ్ గుర్తింపు అనేది ఒక మైలురాయి మాత్రమే, గమ్యం కాదు. 2030 నాటికి భారతదేశంలోనే నంబర్ వన్ పర్యాటక రాష్ట్రంగా ఎదగాలనే లక్ష్యంతో ఏపీ అడుగులు వేస్తోంది. 'స్వర్ణాంధ్ర' సాకారం కావడంలో పర్యాటక రంగం కీలక పాత్ర పోషిస్తోంది. నిన్నటి కల.. నేటి నీతి ఆయోగ్ ప్రశంస.. రేపటి ప్రపంచ స్థాయి గుర్తింపు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం నేడు ఒక బ్రాండ్‌గా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ విజన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలు, కేంద్ర ప్రభుత్వ సహకారం, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కృషి వెరసి.. ఆంధ్రప్రదేశ్ నేడు పర్యాటక ప్రపంచానికి సరికొత్త చిరునామాగా మారింది. ఇది కేవలం ఒక నివేదికలోని ప్రశంస మాత్రమే కాదు; ప్రభుత్వం యొక్క దార్శనికతకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్‌ల త్రైపాక్షిక కృషికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపు. భారతదేశ ఆత్మను ప్రపంచానికి పరిచయం చేస్తూ నీతి ఆయోగ్ విడుదల చేసిన 'దివ్య భారత్' నివేదికలో మన రాష్ట్ర పర్యాటక రంగానికి లభించిన అగ్రతాంబూలం, ఆంధ్రులందరికీ గర్వకారణం. పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ అన్నట్లుగా, "2030 నాటికి దేశంలోనే అగ్రగామిగా ఏపీని నిలపడం" ఒక లక్ష్యం కాదు, అదొక నిశ్చయమైన సంకల్పం. మలుపు మలుపుకో చారిత్రక కోట.. అడుగు అడుగుకో ఆధ్యాత్మిక బాట.. జలపాతాల హోరు.. సాగర తీరాల హోరు, అరకు లోయల సోయగం, దేవాలయాల ఆధ్యాత్మిక పరిమళం... నల్లమల అడవుల గంభీరత వెరసి ఆంధ్రప్రదేశ్ ఒక 'దివ్య భారత్' విండో. నీతి ఆయోగ్ నివేదిక ఒక ప్రారంభం మాత్రమే. రేపటి స్వర్ణాంధ్రలో పర్యాటక రంగం ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలవడమే కాకుండా, ప్రపంచ పర్యాటక చిత్రపటంలో సగర్వంగా మెరవబోతోంది. ఈ నేపథ్యంలో "సందర్శించండి స్వర్ణాంధ్రను.. ఆస్వాదించండి అడుగడుగునా ఆత్మీయ ఆతిథ్యాన్ని!" అని పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా ప్రమోట్ చేస్తుండటం శుభ పరిణామం.



**పెంటమరాజు గోపాల్‌రావు**
పీఆర్వో, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు
కాంటాక్ట్: 9494273373

## జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రావుస్ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

**-విద్యార్థులను ఘనంగా సన్మానించిన మంత్రివ ఎన్ఎండి ఫరూక్**



**నంద్యాల, ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ ఫైల్) :** రావుస్ జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫేజ్–2 ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి, అత్యుత్తమ పర్సంటేజ్ సాధించారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను నంద్యాల మంత్రి క్యాంప్ కార్యాలయం నందు న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ప్రత్యేకంగా అభినందించి, వారిని ఘనంగా సన్మానించారు. మంత్రి ఫరూక్ చేతుల మీదుగా సన్మానం పొందిన విద్యార్థులు హర్షిత్ 95.4075, ఇష్రత్ సుల్తానా 95.2315, పృథ్వీ రాజ్ 93.9114, రాకేష్ 92.9856 మంజునాథ్ 91.3018,ఒమర్ సాకిబ్ 91.1917,హేమంత్ 90.5754, సుధాకర్ 90.4809 లను మంత్రి ఫరూక్ ఘనంగా సన్మానించారు . ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ వంటి కఠినమైన పరీక్షల్లో నంద్యాల విద్యార్థులు ఇంతటి ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణం అన్నారు విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. నంద్యాల ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను మరియు అత్యాధునిక వసతులను స్థానికంగానే అందిస్తున్న రావుస్ జూనియర్ కళాశాల యాజమాన్యాన్ని ఏఎంవి అప్పారావు , మౌని చంద్ర లను ప్రత్యేకంగా అభినందించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ తరగతులు, ఏసీ వసతులతో నూతన భవనాన్ని నిర్మించడం శుభపరిణామం అని అన్నారు . ఇలాంటి విద్యా సంస్థల వల్ల మన ప్రాంత విద్యార్థులు ఇతర నగరాలకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే జాతీయ స్థాయి ర్యాంకులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా రావుస్ జూనియర్ కళాశాల చైర్మన్ ఏఎంవి అప్పారావు మాట్లాడుతూ తమ విద్యార్థుల ప్రతిభను గుర్తించి సన్మానించిన మంత్రి ఫరూక్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఈ విద్యా సంవత్సరం నుండి పద్మావతి నగర్ నందు అన్ని అత్యాధునిక సదుపాయాలతో కూడిన నూతన భవనాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో పూర్తిగా ఏసీ క్లాస్ రూమ్‌లు, డిజిటల్ క్లాస్ రూమ్స్ మరియు అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ ల్యాబ్స్, విశాలమైన గదులు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తున్నట్లు తెలిపారు. రావుస్ జూనియర్ కళాశాల డైరెక్టర్ మౌని చంద్ర మాట్లాడుతూ నంద్యాల మరియు చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులు నాణ్యమైన విద్య కోసం దూరప్రాంతాలకు వెళ్లి ఇబ్బంది పడకూడదన్నదే మా లక్ష్యం అని అందుకే జాతీయ స్థాయి అధ్యాపక బృందంతో అన్ని పోటీ పరీక్షలకు ఇక్కడే శిక్షణ ఇస్తున్నాం అన్నారు . విద్యార్థులు, తల్లిదండ్రులు మా కళాశాలను సందర్శించి, రెండు మూడు రోజులు తరగతులు విని సంతృప్తి చెందిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపయోగంగా రాముల పల్లె గ్రామ బస్టాండ్



**పెగడపల్లి, ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం రాముల పల్లె గ్రామంలో గల బస్టాండ్ గత కొన్ని రోజులుగా చెత్తాచెదారంతో నిండి, అపరిశుభ్రంగా నిరుపయోగంగా ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ బస్టాండ్‌ను శుభ్రం చేసి, ప్రయాణికుల సౌకర్యం వంతం చేయాలని స్థానిక గ్రామాల ప్రజలు అంటున్నారు. నంచర్ల,దీకొండ, రాముల పల్లె గ్రామాల ప్రజలకు ఈ బస్ స్టాండ్ ప్రధానమని ఇక్కడ నుండే జిల్లా కేంద్రానికి, మండల కేంద్రానికి, వివిధ గ్రామాలకు ప్రయాణికులు వెళ్తారని స్థానికులు చెప్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బస్టాండ్‌ను పునరుద్ధరించాలని ప్రయాణికులు గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## డీఎంహెచ్ఓ కార్యాలయ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్..... జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**-జీత బిల్లులు ప్రాసెస్ చేయడానికి నగదు డిమాండ్ చేసినట్లుఅ ఆరోపణలు.**



**పెద్దపల్లి, ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (DMHO) కార్యాలయంలోసూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీ ఎం.డి. అజీమ్ ఖాన్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్ శ్రీ ఓ. రాము ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న కొత్తగా నియమితులైన ల్యాబ్ టెక్నీషియన్ల జీతాలు IFMS పోర్టల్‌లో ప్రాసెస్ చేయడం కోసం సంబంధిత అధికారులచే నగదు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ఫిర్యాదులపై ప్రాథమిక విచారణ నిర్వహించగా, సూపరింటెండెంట్ ఎం.డి. అజీమ్ ఖాన్ మరియు సీనియర్ అసిస్టెంట్ ఓ. రాము జీత బిల్లులు సిద్ధం చేయడం, ప్రాసెస్ చేయడం విషయంలో అక్రమాలు, అధికార దుర్వినియోగం చేసినట్లు తేలినట్లు పేర్కొన్నారు. విచారణలో భాగంగా ల్యాబ్ టెక్నీషియన్ల నుంచి నగదు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో పాటు, సంబంధిత వివరాల్లో అవకతవకలు గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు ప్రారంభించినట్లు కలెక్టర్ వెల్లడించారు. అందుబాటులో ఉన్న సాక్ష్యాధారాల పరిశీలన మేరకు, సూపరింటెండెంట్ ఎం.డి. అజీమ్ ఖాన్ మరియు సీనియర్ అసిస్టెంట్ ఓ. రాము ను తక్షణ ప్రభావంతో సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత అధికారులు ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను వీడరాదని, నిబంధనల ప్రకారం సబ్సిస్టెన్స్ అలవెన్స్ చెల్లించబడుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## మృతదేహం నుంచి బంగారు కమ్మలు మాయం... ప్రభుత్వ ఆసుపత్రిలో కలకలం



**జగిత్యాల, ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో సంచలన ఘటన చోటుచేసుకుంది. కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన బాలవ్వ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందింది.అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకెళ్లగా, చెవులకు ఉన్న బంగారు కమ్మలు కనిపించకపోవడం గమనించారు.దీంతో అనుమానం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు ఆసుపత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. మృతదేహంపై ఉన్న ఆభరణాలు మాయం కావడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సంబంధిత ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం లేదా దొంగతనం జరిగి ఉండవచ్చని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆసుపత్రి పరిసరాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఘటనతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## సెట్‌బ్యాక్ లేకుండా ఇంటి నిర్మాణం... కాలనీవాసుల్లో ఆందోళన



**జగిత్యాల, ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల పట్టణంలోని పోచమ్మవాడలో మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా సెట్‌బ్యాక్ లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. రెండు రోడ్లకు ఆనుకుని ఉన్న స్థలంలో పాత ఇంటి ప్రహరీ గోడల మధ్యనే పిల్లర్లు నిర్మిస్తూ, నిబంధనలు పాటించకుండా నిర్మాణం కొనసాగిస్తున్నట్లు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.ప్రస్తుతం స్లాబ్ వేసే దశకు చేరుకున్న ఈ నిర్మాణంలో భాగంగా పాత గోడలను తొలగించకుండా వల్ల రహదారి ఇరుకుగా మారే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో భవిష్యత్తులో కాలనీలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే పట్టణంలో ఇలాంటి అనధికార నిర్మాణాలు పెరుగుతున్న నేపథ్యంలో, ఈ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసే చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో నిబంధనల ఉల్లంఘనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## వైకాపాజిల్లా యువజన విభాగంలో సభ్యుడిగా అమానుల్లా

**-మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని, బి ఎస్ మక్బుల్ అహమ్మద్‌ను కలిసిన అమానుల్లా**



**తనకల్లు, ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ ఫైల్) :** మండల పరిధిలోని దకదబల వారి పల్లిగ్రామానికి చెందిన అమానుల్లాకు జిల్లా యువజన విభాగ కార్య నిర్వాహక సభ్యుడిగా నియమించినట్లు ఆయన తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు పార్టీ కోసం అహర్నిశల కష్టపడి పనిచేస్తానని ఆయన తెలిపారు నియోజకవర్గ ఇన్చార్జ్ మక్బుల్ అహమ్మద్ కృతజ్ఞతలు తెలిపారు ఇచ్చిన జిల్లా నాయకులకు పార్టీ నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు వైకాపా పార్టీకి కష్టపడి పని చేస్తానని ఆయన తెలిపారు.

## ఒకవైపు దాహం... మరోవైపు తాగునీటి వృథా!

**-నిండిన ట్యాంక్ నీరు ఇళ్లలోకి....**
**-మిషన్ భగీరథ-మున్సిపల్ సమన్వయ లోపంపై విమర్శలు**



**రాయికల్, ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ ఫైల్) :** రాయికల్ మున్సిపల్ పరిధిలో ఒకవైపు కొన్ని వార్డుల్లో తీవ్ర తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు నిర్లక్ష్యంతో విలువైన తాగునీరు వృథాగా పొంగిపోవడం పట్టణంలో చర్చనీయాంశమైంది. పట్టణంలోని చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ వెనుక వైపున ఉన్న వాటర్ ట్యాంక్ బుధవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో నిండిపోయి నీరు పొంగిపొర్లడం ప్రారంభమైంది. అయితే రాత్రి 9:20 గంటలు దాటినా అదే పరిస్థితి కొనసాగిందని స్థానికులు తెలిపారు. ట్యాంక్ నుంచి నిరంతరం పారిన నీరు సమీపంలోని ఇళ్ల వద్దకు చేరి ప్రజలకు ఇబ్బందులు కలిగించింది. ప్రతిరోజూ రెండుసార్లు మిషన్ భగీరథ ద్వారా రాయికల్లోని నాలుగు ట్యాంకుల్లో నీటిని నింపుతున్నప్పటికీ, ట్యాంకులు నిండిన తర్వాత నీటిని సక్రమంగా విడుదల చేసే వ్యవస్థలో లోపాలు ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్న జీయర్ స్వామి ట్రస్టు వెనక ఉన్న ట్యాంక్ పై నుంచి పొంగిపొర్లి బయటకు వెళ్లే నీటికి సరైన డ్రైనేజీ సదుపాయం లేకపోవడం వల్ల నీరు నేరుగా గృహాల సమీపానికి చేరుతోందని తెలిపారు. మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ సిబ్బంది మధ్య సమన్వయ లోపం కారణంగానే ఈ పరిస్థితి నెలకొంటోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఒకవైపు తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతుంటే, మరోవైపు ఇలాంటి నిర్లక్ష్యంతో నీరు వృథా కావడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఉద్యమకారులను గుర్తించని బిఆర్ఎస్ పార్టీ

**-బిఆర్ఎస్ పార్టీ మునిగిపోయే నావ**
**-బిఆర్ఎస్ రెబల్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొంకటి లింగ మూర్తి**



**జగిత్యాల, ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యమకారులను గుర్తించని బిఆర్ఎస్ పార్టీ మునిగిపోయే నావా అని బిఆర్ఎస్ రెబల్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొంకటి లింగ మూర్తి గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ పార్టీ ఎదుగుదల కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకుడు ఈటల రాజేందర్ పై లేనిపోని ఆరోపణలు చేసి నిరూపించకుండానే బయటకు పంపేసారని గుర్తు చేసిన ఆయన కేసీఆర్ పెద్ద మోసగాడని ఎందరినో నిండా ముంచిన వ్యక్తిగా అభివర్ణించారు. 1200మంది బలిదానాలతో తెలంగాణ వస్తే అన్నింటిని త్యాగం చేసిన వాళ్ళని పట్టించుకోకుండా వ్యతిరేకంగా పోరాడిన వారికి మంత్రులను చేసినారానని, పోరాడిన వారికి గుంట భూమో రెండు పడుకల ఇల్లో ఇస్తే కొంత పుణ్యమైన వచ్చేదని ధరణి పోర్టల్ వల్ల కౌలు దారులు ఏండ్ల తరబడి తెచ్చుకున్న కౌలు చట్టం నిష్ప్రయోజనమయి దొరల భూములు దొరలకు దక్కేలా చేసాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు ఇస్తానన్న భూములు ఇవ్వకపోగా వైకుంఠ ధమాలు, క్రీడా ప్రాంగణాల పేరుతో దళితుల భూములు గుంజుకున్నారన్నారు. కేసీఆర్‌తప్పిదంవల్లనే తెలంగాణలోపార్టీ ఓడిపోయిందన్న ఆయన మళ్ళీ బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి రాదని టిఆర్ఎస్ రెబల్ ఎంపీ అభ్యర్థి కొంకటి లింగమూర్తి అన్నారు.

## ప్రతి విద్యార్థికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ఫలాలు : కల్లూరి శకుంతలమ్మ



**శిరివెళ్ల,(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వ పాలనలో ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిల ప్రియ గారి పర్యవేక్షణలో ప్రతి విద్యార్థికి విద్యా ఫలాలు చక్కగా అమలవుతున్నాయని నంద్యాల జిల్లా టిడిపి ఉపాధ్యక్షురాలు కల్లూరి శకుంతలమ్మ శేష ఓబులరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో వేసవి సెలవులు శుక్రవారం నుండి ప్రారంభం అవుతున్నాయని ఈ సెలవులను ప్రతి విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని వినోదంతో పాటు విజ్ఞానాన్ని అలవర్చుకోవాలని తెలియజేశారు. గడిచిన విద్యా సంవత్సరంలో ప్రతిభాపాటవాలు సాధించిన చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు అందించి రాబోయే విద్యా సంవత్సరానికి సంబంధించి వేసవి సెలవులలోనే చదువుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయాలని కల్లూరి శకుంతలమ్మ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు నీటి సంఘం ఉపాధ్యక్షులు చింతకుంట్ల భూసిరెడ్డి కల్లూరి శేష ఓబులరెడ్డి ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తుల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**-కలెక్టర్ కూమార్ దీపక్**



**తాండూర్, ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ ఫైల్) :** వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో ప్రజలు అందించిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం తాండూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి కలెక్టర్ కుమార్ దీపక్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా భూ భారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించారు. కార్యాలయంలో రికార్డులను, పెండింగ్ దరఖాస్తుల వివరాలను తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రభుత్వ నిబంధనల ప్రకారం, పారదర్శకంగా పరిష్కరించాలి. ఎలాంటి జాప్యం లేకుండా అర్హులైన వారికి న్యాయం జరిగేలా చూడాలని తహసీల్దార్ జ్యోత్స్న ను ఆదేశించారు. ఇందులో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వారం రోజుల్లో యువజన కాంగ్రెస్ కొత్త కమిటీలు ఏర్పాటు: బీరం రాజేష్



**జగిత్యాల, ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల నియోజకవర్గంలో వారం రోజుల్లో యువజన కాంగ్రెస్ కొత్త కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రాజేష్ తెలిపారు. గురువారం ఉదయం జగిత్యాల జిల్లా కేంద్రంలోని మోతే రోడ్డులో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి యువజన కాంగ్రెస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ గ్రామాన యువజన కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేసి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ సాయి, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కర్నె భూమరెడ్డి, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ బోదసు జలపతి, సారంగపూర్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్, జిల్లా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొద్దుల శివ కుమార్, మండల యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ ప్రహ్లాద హరీష్, పురుషోత్తం, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల





**మార్కాపురం, ఏప్రిల్ 24(జర్నలిస్ట్ ఫైల్) :** మార్కాపురంజిల్లాకంబం పట్టణంలో, కాప వీధిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే గారికి ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అశోక్ రెడ్డి, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించినారు. పూజ అనంతరం అర్చకులు ఎమ్మెల్యేకి వేదాశీర్వచనం అందించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను,స్వామి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, స్వామి వారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు కంబం మండల,స్థానిక నాయకులు, జనసైనికులు, భారీ సంఖ్యలో భక్తులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా వల్లభనేని సాయి ప్రసాద్ వర్ధంతి



- ఎంఎస్ఎస్ భవన్‌లో నివాళులు
- పేదలకు అన్నదానం, అనాధలకు సేవలు

మంగళగిరి( జర్నలిస్ట్ ఫైల్): మంగళగిరి ఎంఎస్ఎస్ భవన్‌లో ప్రముఖ తెలుగుదేశం పార్టీ నేత, సేవా భావంతో గుర్తింపు పొందిన వల్లభనేని సాయి ప్రసాద్ రెండవ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్ర వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో మంగళగిరి పీఏసీఎస్ చైర్మన్ గాదె పిచ్చి రెడ్డి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ సభ్యులలో ఒకరైన వల్లభనేని సాయి ప్రసాద్ పార్టీ అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అప్పటి హెల్త్ మినిస్టర్ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు పిఏగా, మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఆయన నిర్వర్తించిన బాధ్యతలు పార్టీకి ఎంతో మేలు చేకూర్చాయని తెలిపారు.

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిజిస్టార్ గా విద్యా రంగంలో కూడా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. వర్ధంతి సందర్భంగా మంగళగిరి అన్నకాంటీన్ వద్ద పేదలకు ఉచిత భోజనాన్ని పంపిణీ చేయడంతో పాటు, షారోన్ ఆశ్రయంలో అనాధలకు అన్నదానం నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాలు ఆయన సేవా భావాన్ని ప్రతిబింబిస్తున్నాయని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

## కుంచవరం శ్రీవారాహీమాత ఆలయం వద్ద చలివేంద్రం సేవలు



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): వాతావరణం లో ఉష్ణోగ్రత శాతం రోజురోజుకు అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో, వేసవి దాహార్తిని తీర్చేందుకు పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్, శ్రీ వారాహి అమ్మవారి ఆలయం వద్ద పాదచారులకు చలివేంద్రం సేవలను ప్రారంభించారు.

జిల్లా ప్రభుత్వ యంత్రాంగం గ్రామాల్లో కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్న విధానానికి పిలుపునిచ్చిన క్రమంలో, జాతీయ పంచాయతీ దినోత్సవ సందర్భంగా శుక్రవారం, కొల్లిపర మండలం కుంచవరం గ్రామంలో వేంచేసియున్న, శ్రీవారాహి మాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం సేవలను, గ్రామ కార్యదర్శి అడప నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా పాదుచారులకు, చల్లని రక్షిత మంచినీటితో పాటుగా, మజ్జిగ పంపిణీ చేశారు. ఎస్ చెన్నప్ప రెడ్డి కోటేశ్వరమ్మ దంపతుల, వితరణతో ఏర్పాటు చేసిన చలివేంద్ర ప్రారంభ కార్యక్రమంలో, శ్రీ వారాహి అమ్మ వారి ,ఆలయ ధర్మకర్తలు తన్నీరు శ్రీనివాస్ బాబు, శివనాగమల్లేశ్వరీ దుపతులు, యోగచార్య ముద్దాబత్తుని రమణయ్య, చందు అయ్యన్న, గోపి, సుబ్బారావు, నాఉచారయ్య, వెలివెల బసవ కోటేశ్వర్రావు, ఎటిఎమ్ శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రం రద్దు

- బి. మఠం డిగ్రీ కళాశాల విద్యార్థులకు మైదుకూరు పరీక్ష కేంద్రం

బ్రహ్మంగారి మఠం (జర్నలిస్ట్ ఫైల్ ):బ్రహ్మంగారిమఠం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈనెల 28వ తేదీన నుంచి జరిగే సెమిస్టర్ పరీక్షలను మైదుకూరులోని ఎస్బిఎస్వైఎం డిగ్రీ కళాశాలలో హాజరై రాయాలని యోగివేమన విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె ఎస్ వి కృష్ణారావు తెలిపారు. స్థానికంగా జరిగే బ్రహ్మంగారి ఆరాధనోత్సవాల కారణంగా విద్యార్థులకు అసౌకర్యంగా ఉంటుందని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని రద్దు చేశామన్నారు. యుజీ డిగ్రీ ×× సెమిస్టర్ (సప్లిమెంటరీ), ×ఎ సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ మార్పును గమనించాలన్నారు. విశ్వవిద్యాలయ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మైదుకూరులోని ఎస్‌బిఎస్‌వైఎం డిగ్రీ కళాశాలలో బి.మఠం కళాశాల విద్యార్థులు పరీక్షలు రాసేందుకు విశ్వవిద్యాలయం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేర్ కృష్ణారావు తెలిపారు.

## గౌరవ వేతనాలకు 30 లోగా ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) : ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇమామ్ మోజోన్లకు ప్రభుత్వం నుంచి గౌరవ వేతనాలకు మసీదులకు సంబంధించిన పత్రాలను ఈ నెల 30వ తేదీలోగా అందజేయాలని జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి సి.పార్థసారథి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా మసీదులకు చెందిన ఇమామ్ మోజోన్లకు ప్రభుత్వం నుంచి గౌరవ వేతనాలు విడుదలవుతాయని, మసీదు కమిటీ ప్రెసిడెంట్ లేదా ముతవల్లీలు ఆయా డాక్యుమెంట్లను, మసీదు రిజిస్ట్రేషన్, మసీదుకు సంబంధించిన స్థలం పత్రాలను గుంటూరు కలెక్టర్ ఆఫీస్ లోనే జిల్లా వక్స్ బోర్డు కార్యాలయానికి కచ్చితంగా సమర్పించాలని అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని మసీదులు ఉమ్మీద్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు గుంటూరు, బాపట్ల జిల్లాల వక్స్ బోర్డు ఇన్స్పెక్టర్, సెల్ నెంబర్, 7331157344 , 9885142258 సంప్రదించవచ్చని వివరించారు.

## మారుతినగర్‌లో ఆక్రమణలు, గ్యాస్ గౌడౌన్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవికి వినతి

- ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వినతి పత్రం అందజేసిన ఉద్యోగులు
- పాత పుస్తకాల దుకాణదారులు అద్దె చెల్లింపు గడువు ఇప్పించాలని కోరగా, వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రజా గ్రీవెన్స్ నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుండి పెద్ద సంఖ్యలో అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను వెంటనే పరిగణలోకి తీసుకున్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో సంప్రదించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మారుతినగర్ ఆర్చి నుండి గ్యాస్ గౌడౌన్ వరకు రోడ్డుకి ఇరువైపులా ఆక్రమణలు పెరిగి పాదచారులు, వాహనదారులకు ప్రాణాపాయం ఏర్పడుతున్నదని స్థానికులు ఫిర్యాదు చేశారు. అదే ప్రాంతంలో చెత్తను నిర్లక్ష్యంగా రోడ్లపై వేయడం వల్ల తీవ్ర దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా 110 కుటుంబాలు నివసించే ప్రాంతంలో గ్యాస్ గౌడౌన్ ఉండటం ప్రమాదకరమని, దానిని వేరే ప్రాంతానికి తరలించాలంటూ వినతిపత్రం అందజేశారు.

గుంటూరు ఏటి అగ్రహారానికి చెందిన షేక్ ఖాళీసావలి రోడ్డు విస్తరణలో తన ఇల్లు కోల్పోయినప్పటికీ ఇప్పటి వం-కు జీఎంసీ నుండి టిడిఆర్ బాండ్లు అందలేదని, తనకు న్యాయం చేయాలని కోరారు. గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో 10-15 సంవత్సరాలుగా తక్కువ జీతాలతో పనిచేస్తున్న సుమారు 1633 మంది అవుట్‌సోర్సింగ్ టీచర్లు, లెక్చరర్లు తమ పోస్టులను రెగ్యులర్ చేయాలని లేదా జ=ూ కింద మార్చాలని వినతిపత్రం సమర్పించారు.

21వ వార్డు యతిరాజు కాలనీలో తాగునీటి సరఫరా సక్రమంగా లేక మహిళలు ఫిర్యాదు చేయగా, ఎమ్మెల్యే వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు.

అరండల్ పేట 1వ లైన్‌లో ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో పాత పుస్తకాల వ్యాపారం చేస్తున్న లబ్ధిదారులు తమ ఆర్థిక ఇబ్బందులను వివరించారు. శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, రహదారి మూసివేతలు, ఆన్‌లైన్ వ్యాపారం ప్రభావం, కరోనా తర్వాత పరిస్థితుల వల్ల తమ వ్యాపారం తీవ్రంగా దెబ్బతిన్నదని తెలిపారు. అద్దె బకాయిలు చెల్లించలేని స్థితిలో ఉన్నందున గడువు ఇవ్వాలని కోరగా, ఎమ్మెల్యే రెవెన్యూ ఇన్స్పెక్టర్‌తో మాట్లాడి వారికి గడువు మంజూరు చేయించారు.

అనంతరం 36వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. డ్రైనేజీ, రోడ్లు, శానిటేషన్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నామని తెలిపారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని, కొంత సమయం పట్టే సమస్యలపై స్పష్టమైన వివరణ ఇచ్చి ప్రభుత్వం విధానాల ద్వారా పరిష్కారం అందిస్తున్నామని చెప్పారు. ఉద్యోగ నియామకాలు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలు, బదిలీలకు సంబంధించిన వినతులు అధికంగా వస్తున్నాయని వివరించారు.

**36వ డివిజన్‌పై ప్రత్యేక దృష్టి:** శ్యామలనగర్ ప్రాంతంలో ఖాళీ స్థలాల వల్ల డ్రైనేజీ సమస్యలు, చెత్త పేరుకుపోవడం వంటి సమస్యలను గుర్తించి ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. శానిటరీ ఇన్స్పెక్టర్లకు బాధ్యతలు అప్పగించి పరిస్థితిని మెరుగుపరిచే చర్యలు తీసుకున్నామని చెప్పారు. నేలపై ఉన్న విద్యుత్ వైర్లను సరిచేయడానికి పోల్స్ ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖకు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. కొన్ని రోడ్ల పనులు అంచనా దశలో ఉండగా త్వరలో టెండర్ల ద్వారా ప్రారంభమవుతాయని వెల్లడించారు. అలాగే కుక్కల సమస్యపై కమ్యూనిటీ ఫీడింగ్ సెంటర్ల ఏర్పాటు ద్వారా పరిష్కారం చూపే దిశగా జీఎంసీతో కలిసి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ప్రజల నుండి వచ్చిన ప్రతి సమస్యను వేగంగా పరిష్కరించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా పరిపాలన అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి సమస్యకు పరిష్కారం చూపేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## సి.ఆర్.డి.ఏ, రెవెన్యూ శాఖలు అత్యంత సమన్వయంతో పనిచేయాలి



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) : సి.ఆర్.డి.ఏ, రెవెన్యూ శాఖలు అత్యంత సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ అన్నారు. సి.ఆర్.డి.ఏ, రెవెన్యూ శాఖల సమన్వయ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాజధాని నగరాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మాణానికి చర్యలు చేపట్టిందని అన్నారు. ఈ నేపథ్యంలో సి.ఆర్.డి.ఏ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం అవసరమని స్పష్టం చేశారు. భూ సంబంధిత అంశాలకు చెందిన దస్త్రాలు సంబంధిత ప్రతిపాదనలు తహసిల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారుల ఆధ్వర్యంలో జరగాలని అన్నారు. భూ సేకరణ అధికారులు భూ సేకరణకు అవసరమగు నోటిఫికేషన్లు, నోటీసులు జారీ చేయడంలో నిర్దిష్టమైన నిబంధనలు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రజల నుండి వచ్చే అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని సూచించారు. భూ సేకరణ ప్రక్రియలో నిబంధనలను పక్కాగా పాటించాలని అన్నారు. జిల్లా నుండి పరిష్కరించవలసిన అంశాలపై స్పష్టమైన వివరాలు అందించాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి రికార్డును డిజిటలైజేషన్ చేయాలని, ఈ ప్రక్రియలో భాగంగా శాటిలైట్ ఛాయాచిత్రాలను పొందుపరచాలని అన్నారు. డాక్యుమెంటరీ సపోర్టుగా ప్రతి అంశాన్ని విధిగా జత చేయాలని స్పష్టం చేశారు. గ్రామాల వారీగా భూ పరిశీలనకు జాయింట్ టీంలను ఏర్పాటు చేయాలని చెప్పారు.

సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ భార్గవ తేజ మాట్లాడుతూ 8,352.69 చదరపు కిలో మీటర్ల పరిధిలో సి.ఆర్.డి.ఏ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో సి.ఆర్.డి.ఏ చట్టం ప్రకారం భూ సేకరణ ప్రక్రియ ఇతర అంశాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ భూమి, బంజరు, ఇనాం, దేవాదాయ, నీటిపారుదల తదితర భూముల కేటగిరీ వారీగా కార్యాచరణ ప్రణాళికలు అవసరం అని వివరించారు.

ఈ సమన్వయ సమావేశంలో గుంటూరు, పల్నాడు జాయింట్ కలెక్టర్ లు అశుతోష్ శ్రీవాస్తవ, సంజనా సింహా, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, తెనాలి ఇన్ ఛార్జ్ సబ్ కలెక్టర్ లక్ష్మీ కుమారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, సి.ఆర్.డి.ఏ భూ సేకరణ అధికారులు, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## హోమ్ కంపోస్ట్ తయారీపై క్షేత్రస్థాయి అవగాహన పెంచాలి



- మున్సిపల్ కమీషనర్ జె. రామ అప్పలనాయుడు

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):పట్టణ ప్రజలకు హోమ్ కంపోస్ట్ తయారీలో అవగాహన కల్పించడం లో,మెప్మా రిసోర్స్ పర్సన్ లు బాధ్యాయుత సేవలు అందించాలన్నారు.

స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన, హోం కంపోస్ట్ పై అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామా అప్పలనాయుడు, మేప్మా రిసోర్స్ పర్సన్స్ కు హోమ్ కంపోస్ట్ డబ్బాలు, శానిటరీ సిబ్బందికి చెప్పులు పంపిణీ చేశారు. ఆయా వార్డుల ప్రజలకు హోమ్ కంపోస్ట్ పై అవగాహన కల్పించి, అందరూ హోమ్ కంపోస్ట్ తయారు చేసే విధంగా చూడాలని అన్నారు. హోమ్ కంపోస్ట్ ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ జాస్తి రామారావు ఆరోగ్య శాఖ అధికారి మొవ్వ ఏసుబాబు మెప్మా సీఎం ఎం విజయ కుమారి, సానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు , శానిటరీమేస్త్రిలు, సి ఓ లు ,ఆర్పీలు పాల్గొన్నారు.

## నగరంలో త్రాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది త్రాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, త్రాగునీటి సరఫరా జరుగు సమయంలో ప్రతి రోజు ప్రతి రిజర్వాయర్ పరిధిలో తప్పని సరిగా త్రాగునీటి టెస్టింగ్ పనులు నూరు శాతం జరగాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజనీరింగ్ కారులను ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అధికారులు సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో అన్ని రిజర్వాయర్ల పరిధిలో ప్రతి రోజు త్రాగునీటి సరఫరా సమయంలో శాంపిల్స్ సేకరించి తనిఖీ చేయాలన్నారు. త్రాగునీటి కాలుష్యం జరిగితే ప్రజల ఆరోగ్యానికి తీవ్ర సమస్యలు వస్తాయని, డ్రైన్ ని క్రాస్ చేసి ఇంటికి త్రాగునీరు అందే ప్రతి పైప్ లైన్లను ఈ నెలాఖరు నాటికి తప్పని సరిగా మార్చుకోవాల్సిందేనన్నారు. నగరంలో ఉన్న బోర్ వేల్స్ మరమ్మతులకు లోనై ఉంటె వెంటనే వాటికి మరమ్మతులు నిర్వహించాలన్నారు. పబ్లిక్ టాయిలెట్స్ మరమ్మతులు ఏమైనా ఉంటె వెంటనే వాటికి మరమ్మతులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఏ.ఈ ల వారి వారి డివిజన్లలోని అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకొని పెండింగ్ ఉన్న వెంటనే అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, సదరు పనులు పూర్తైన వెంటనే బిల్లుల చెల్లింపుకు నిధి పోర్టల్ లో అప్ లోడ్ చేయాలన్నారు. నగరంలోని ప్రతి స్మశానవాటికలో మౌలిక వసతుల కల్పన చేయుటకు సంబంధిత ఏ.ఈలు వారి పరిధిలోని స్మశానవాటికలలో పర్యటించి సమస్యలను గుర్తించి, అవసరమైన మౌలిక సదుపాయాలు కలిపించాలన్నారు. అలాగే నగర పాలక సంస్థ పార్కులలో అనుమతించిన అభివృద్ధి పనులను, జియంసి ఓపెన్, రిజర్వ్ సైట్లలో పార్కులను అభివృద్ధి చేయాలన్నారు. నగరంలో ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో జియంసి చలివెంద్రాలను త్వరితగతిన ఏర్పాటుకు చేశామని, ఇంకా అవసరమైన ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని ప్రాధాన అవుట్ ఫాల్ డ్రైన్లలో డీసిల్టింగ్ పనులను అన్ని డివిజన్లలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా పాట్ హోల్స్ లేకుండా వెంటనే వాటికి మరమ్మతులు నిర్వహించాలన్నారు. వర్షాకాల ముందస్తు కార్యాచరణ ప్రణాళిక క్రింద ఆమోదించిన పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలన్నారు. సమావేశంలో యస్.ఈ జి. వెంకటేశ్వరావు, ఈఈలు సుందర రామిరెడ్డి, వేణు, విష్ణు, డి ఈఈలు, ఏఈలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు..

## అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి



కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ): అంగన్వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాకుమాను మండలం అంగన్వాడీ సిబ్బంది తహసీల్దార్ బి వెంకట స్వామి కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు 2019 నుండి వేతనాలు పెరగలేదన్నారు. ఈ కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని . అంగన్వాడీలకు రకరకాల యాప్లు తెచ్చి పనిభారం పెంచారన్నారు . ఈ కాలంలోవేతనాలు పెంచాలని చేసిన అనేక పోరాటాలు ఫలితంగానే 2024 జూలై నెలలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారన్నారు .దాని గురించి ఈ ప్రభుత్వం ఇంతవరకు అమలు చేయాలేదన్నారు .

2026 మార్చి 2 బడ్జెట్ సమావేశాల సందర్భంగా అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని ఇతర సమస్యల పరిష్కారం కోసం చేసిన ఆందోళన ఫలితంగా మార్చి 10వ తేదీన ఐసిడిఎస్ మంత్రి అంగన్వాడీ యూనియన్ నాయకులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి తో మాట్లాడి త్వరలోనే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు . కాని ప్రభుత్వం నేటికీ పట్టించుకోలేదన్నారు .ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నాయని . ప్రీ స్కూల్ పిల్లలు రావడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు .

మే నెలమొత్తం వేసవి సెలవులు ఇవ్వాలని అనేక మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోలేదన్నారు . హెల్పర్ల ప్రమోషన్లకుఇచ్చిన గైడ్లైన్స్ జీవో నెంబర్ 5 హెల్పర్లకు నష్టం చేసే విధంగా ఉందన్నారు . ఇంకా పెండింగ్లో కొన్ని మినీ సెంటర్ల అప్గ్రేడ్‌కాకుండా ఆగిపోయాయన్నారు . వాటిని కూడా అప్గ్రేడ్ చేయాలన్నారు . కావున ఈ క్రింది డిమాండ్స్ పరిష్కారం చేయాలని నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళన చేస్తున్నామని తెలియజేస్తున్నామన్నారు .ప్రధానంగా అంగన్వాడీలకు కనీస వేతనం 22,000/-లు ఇవ్వాలి. అంగన్వాడీ సెంటర్లకు మే నెల మొత్తం వేసవి సెలవులు ఇవ్వాలి. హెల్పర్ల ప్రమోషన్స్ గైడ్లైన్స్ ఇచ్చిన జీవో 5 ను సవరించాలి. పెండింగ్లో ఉన్న మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పుచేయాలి. ఈ సమస్యల సాధన కొరకు తాము నిరసన తెలుపుతున్నమ్మన్నారు.

## కాటూరి పబ్లిక్ స్కూల్‌లో ఎల్కేజీ విద్యార్థులకు ప్రమోషన్ డే





గుంటూరు(లాలుపురం),(జర్నలిస్ట్ ఫైల్) : లాలుపురంలోని కాటూరి పబ్లిక్ స్కూల్‌లో ఎల్కేజీ విద్యార్థుల కోసం ప్రమోషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రంగురంగుల దుస్తుల్లో పాల్గొని ఆకట్టుకున్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులు పాటలు, నృత్యాలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు చిన్నారులను ప్రోత్సహిస్తూ, వారి ప్రతిభను అభినందించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్కూల్ డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధిలో ప్రాథమిక దశ ఎంతో ముఖ్యమని, చిన్నారులలో సృజనాత్మకతను పెంపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. తల్లిదండ్రులు కూడా పెద్ద ఎత్తున హాజరై చిన్నారులను ప్రోత్సహించారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిసింది.

## ఎస్ఆర్ఎం వర్సిటీలో ఘనంగా రీసెర్చ్ డే



- 7 గురు అధ్యాపకులకు బెస్ట్ రీసెర్చర్ అవార్డ్స్
- మరో 15 మందికి హైలీ ప్రొడక్టివ్ రీసెర్చర్ అవార్డులు

మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్): ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం 10వ రీసెర్చ్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన రీసెర్చ్ డే సదస్సులో పరిశోధనల పరంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు అధ్యాపకులను ఘనంగా సత్కరించి వారికి నగదు పారితోషికాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో కాకినాడ ఏఎం గ్రీన్ కంపెనీ టెక్నాలజీ ఆఫీసర్ మరియు కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఎస్వీ రామకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని పరిశోధక విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గ్రీన్ ఎనర్జి, గ్రీన్ అమ్మోనియా ప్రయోజనాలను వివరించారు. యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, యూనివర్సిటీలో పరిశోధనలకు పెద్దపీట వేస్తున్నామనీ, అధ్యాపకులను పరిశోధనల పరంగా ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా ఉత్తమ పరిశోధక పురస్కారాలను అందజేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది నుంచి పీజీ స్కాలర్లకు కూడా అవార్డులు అందజేస్తామని ప్రకటించారు. ఎస్ఆర్ఎం గ్రూప్ రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య డి నారాయణరావు మాట్లాడుతూ, పరిశోధనల పరంగా ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ ఎంతో ముందుందనీ, 9 మంది ప్రొఫెసర్లకు ఏఎన్ఆర్ఎఫ్ గ్రాంటు లభించడం విశేషమన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డీన్ డాక్టర్ సీవీ టామి. కార్యక్రమ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఆయేషాలు ప్రసంగించారు.

**7 గురికి బెస్ట్ రీసెర్చర్ అవార్డులు**

ఈ సందర్భంగా పరిశోధనల పరంగా విస్తృతంగా కృషి చేస్తున్న ఏడుగురు ప్రొఫెసర్లకు ఉత్తమ పరిశోధక పురస్కారాలను ప్రదానం చేశారు. బెస్ట్ ఎక్స్పెరిమెంట్ రీసెర్చర్ అవార్డుకు డాక్టర్ సభ్యసాచి చక్రబర్తిని ఎంపిక చేయగా, బెస్ట్ థియరాటికల్ రీసెర్చర్ అవార్డును డాక్టర్ సంబిత్ కుమార్ మిశ్రాకు అందజేశారు. బెస్ట్ ఇండస్ట్రియల్ రీసెర్చర్ అవార్డును డాక్టర్ ఆశు అబ్దుల్కు ప్రకటించారు. అదేవిధంగా బెస్ట్ యంగ్ రీసెర్చర్ అవార్డును డాక్టర్ రవికుమార్, బెస్ట్ సోషియల్ ఇంపాక్ట్ రీసెర్చర్ అవార్డును డాక్టర్ బొజ్జగాని శ్రీరాములుకు, బెస్ట్ మేనేజ్మెంట్ రీసెర్చర్ అవార్డును డాక్టర్ ఏవీఎస్ కామేష్ కు, బెస్ట్ సోషల్ సైన్స్ రీసెర్చర్ అవార్డును డాక్టర్ సోనీ వాద్వాకు అందజేశారు. వీరందరినీ వేదికపై కి సాదరంగా ఆహ్వానించి సత్కరించి జ్ఞాపికలను ప్రదానం చేశారు. వీరితో పాటు మరో 15 మంది ప్రొఫెసర్లకు హైలీ ప్రొడక్టివ్ రీసెర్చర్ అవార్డులు ప్రకటించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్, డీన్ డాక్టర్ విష్ణుపథ్, డాక్టర్ రంజిత్ థాపా, డాక్టర్ రాజ పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## టిఎన్‌టియుసి నూతన కార్యవర్గం

### బాధ్యాతాయుతమైన సేవలతో పార్టీ ప్రతిష్ట పెంచాలి



○ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** కార్మికుల సమస్యల పరిష్కారంలో బలమైన శక్తిగా ఉన్న,తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కు నియోజక వర్గ స్థాయిలో, నూతనంగా ఎంపికైన సభ్యులు, కార్మికుల పట్ల, వారి సమస్యల పట్ల, బాధ్యతగా వ్యవహరిస్తు, పార్టీ ప్రతిష్టను పెంచాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ టిఎన్ టియుసి, నూతన కార్యవర్గం చేత, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈక్రమంలో టిఎన్ టియుసి చైర్మన్ గా, జిలాని, నియోజక వర్గ అధ్యక్షులుగా తాడిబోయిన హరిప్రసాద్, మండల అధ్యక్షులుగా కొండారెడ్డి రామారావు, కొల్లిపర మండల అధ్యక్షులుగా గోవతోటి పోలీసు నియమితులైనారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు, టిఎన్ టియుసి ట్రేడ్ యూనియన్ నూతన కార్యవర్గం కార్మికుల సమస్యల పట్ల, వారి హక్కుల పరిరక్షణ పట్ల, క్రియాశీలక సేవలందిస్తు, పార్టీ ప్రతిష్టను పెంచేలా సేవలు అందించాలన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు మహ్మద్ కుద్దూస్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాలడుగు సురేంద్ర, నల్లిబోయిన నాగేశ్వరావు, కుదరవల్లి శ్రీనివాసరావు,తదితర పార్టీశ్రేణులు పాల్గొన్నారు. తొలుత కార్యాలయం వద్ద విశేషంగా బాణసంచా వెలిగించి టిఎన్ టియుసి కార్మిక సంఘ సభ్యులు సందడి చేశారు.

## నిడదవోలు ట్రాఫిక్ కష్టాలకు తెర



○ ఆర్వోబీ పనులపై మంత్రి కందుల దుర్గేష్ స్పెషల్ ఫోకస్

○ యుద్ధ ప్రాతిపదికన ఆర్వోబీ పనులు పూర్తి చేయాలని అధికారులకు మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాలు జారీ

○ శాఖల మధ్య సమన్వయం, సహకారం అవసరం.. సమిష్టిగా పనిచేసి నిర్ణీత గడువులోగా ఆర్వోబీ పూర్తి చేయాలని సూచన

**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్) :** నిడదవోలు పట్టణ ప్రజల దశాబ్దాల కల అయిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిడదవోలులోని తన కార్యాలయంలో ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖల అధికారులతో మంత్రి దుర్గేష్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన, పనుల్లో జాప్యాన్ని నివారించేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్వోబీ నిర్మాణంలో ఎదురవుతున్న సాంకేతిక, పరిపాలనా పరమైన అడ్డంకులను తొలగించేందుకు ఇరిగేషన్, ఆర్ అండ్ బి శాఖలు సమిష్టిగా, ఒకరికొకరు సహకారంతో పనిచేయాలని మంత్రి సూచించారు. పనుల నిర్వహణలో ఏవైనా అంతరాయాలు కలిగితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, జాప్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. నిడదవోలులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, ఈ ప్రాజెక్టు నిర్ణీత గడువులోగా పూర్తయితేనే ప్రజలకు శాశ్వత విముక్తి లభిస్తుందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకుండా, నిర్ణీత గడువులోగా వంతెనను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

## శక్తి యాప్‌తో యువతికి తప్పిన ప్రమాదం



○ శక్తి యాప్ అలర్ట్‌తో క్షణాల్లో చేరుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు

○ ఆటో డ్రైవర్ ను అదుపులో తీసుకున్న పోలీసులు

**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్):** శక్తి యాప్ వినియోగంతో ఓ యువతి అత్యాచారయత్నం నుంచి తప్పించుకున్నట్లు మంగళగిరి గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. గురువారం అర్ధరాత్రి సమయంలో విజయవాడ బస్టాండ్‌లో ఆటో ఎక్కిన యువతిని చిన్న కాకాని సమీపంలో డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తిస్తూ అత్యాచారయత్నానికి పాల్పడగా, ఆమె శక్తి యాప్ ద్వారా సమాచారమిచ్చింది. వెంటనే స్పందించిన ఆయన నిందితుడు ఫణీంద్రను వెంబడించి పట్టుకుని యువతిని రక్షించినట్లు తెలిపారు. బెంగళూరు నుంచి అర్ధరాత్రి బయలుదేరి విజయవాడకు చేరుకున్న యువతి అప్రమత్తతతో ప్రమాదం నుంచి తప్పించుకుంది. గురువారం రాత్రి విజయవాడ బస్టాండ్‌లో ఓ ఆటో డ్రైవర్ మాయమాటలు చెప్పి ఆమెను తన వాహనంలో ఎక్కించుకున్నాడు..ఆటో మంగళగిరి దాటి చిన్న కాకాని సమీపానికి చేరుకున్న తర్వాత డ్రైవర్ యువతిపై అసభ్యంగా ప్రవర్తిస్తూ అత్యాచారయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. భయాందోళనకు గురైన యువతి సమయోచితంగా శక్తి యాప్ ద్వారా పోలీసులకు సమాచారాన్ని చేరవేసింది. సమాచారం అందుకున్న మంగళగిరి గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ వెంటనే పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని యువతిని రక్షించారు. ఈ క్రమంలో నిందితుడు పారిపోవడానికి యత్నించగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. నిందితుడు తాడేపల్లి సీతానగరం కు చెందిన బోయిన ఫణీంద్రగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. యువతిని సురక్షితంగా ఆమె స్వస్థలానికి చేర్చినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో "శక్తి యాప్" వినియోగం ఎంత ప్రభావవంతంగా ఉంటుందో ఈ ఘటన స్పష్టంచేసిందని గ్రామీణ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ పేర్కొన్నారు.

# సమస్యల పరిష్కారమే కుటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్సీ ఆలపాటి





**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** విభిన్న సమస్యలతొ వచ్చిన అర్జీలను స్వీకరించామని, ప్రతి అర్జీని సంబందిత అధికారులతొ, పాటు మంత్రుల దృష్టికి తీసుకు వెళ్ళి, సమస్య పరిష్కారం దిశగా చిత్తశుద్ధితొ కృషి చేస్తామని, సమస్యల పరిష్కారమే, కూటమి ప్రభుత్వ లక్ష్యమని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం సూచనలతో,నియోజక పార్టీ కార్యాలయాల్లొ ప్రతిశుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్ కు, తగుప్రాధాన్యం కల్పిస్తున్నారు.

ఈక్రమంలొ శుక్రవారం స్థానిక రామలింగేశ్వర పేటలోని, తెలుగుదేశం పార్టీ కార్యాలయంలొ శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో, నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్త, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రసాద్, అర్జీ దారుల నుండి అర్జీలు స్వీకరించారు. సమస్య పరిష్కారం దిశగా కృషి చేస్తామని, అర్జీ దారులకు బరోసా కల్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతు వచ్చిన విభిన్న సమస్యల అర్జీల వివరాలు చెబుతు, సంబందిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్ళి, పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు.

ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు మహ్మద్ కుద్దూస, బిసి సంఘ నాయకులు, పద్మశాలీయ కార్పోరేషన్ డైరెక్టర్ జాన్నాదుల మహేష్ తదితర పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

○ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

○ గుంటూరు తూర్పులో ప్రజా దర్బార్ నిర్వహణ

○ అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే అవకాశం ప్రజాదర్బార్ ద్వారా కలిగిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. జగన్ ప్రభుత్వంలో సెంటు స్థలం ఇచ్చామని పట్టా చేతిలో పెట్టారు.. కానీ స్థలం ఎక్కడ ఉందో చూపించ లేదని, రేషన్ కార్డులు, పింఛన్లపై ఎమ్మెల్యే నసీర్ కు అర్జీలు అందజేశారు. వివిధ సమస్యలపై అర్జీలు దాఖలు కాగా కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే నసీర్ ఫోన్ లో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు చేపడతామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. త్వరలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని, పెద్ద ఇల్లు ఉందని, ఇలా ఏవేవో కుంటిసాకులు చెప్పి పింఛన్లు, రేషన్ కార్డులకు ఎగనామం పెట్టారని తెలిపారు. దీంతో ప్రజాదర్బార్ లో ఎక్కువ శాతం పింఛన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వస్తున్నాయని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పింఛన్ పెంచితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యి రూపాయలు పెంచామని తెలిపారు. రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల ద్వారా ఐదు రూపాయలకే కడుపు నిండా ఆహారం పెట్టే గొప్ప పథకానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. అగ్గిపెట్టెలులాంటి సెంటు భూమి ఇచ్చి నిరుపేదల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేసి ప్రజలతో శభాష్ అనిపించుకున్నారని వివరించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కేవలం 18 నెలల కాలంలోనే మెగా జాబ్ మేళా ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించామని, ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే సంకల్పంతో పని చేస్తున్నామని చెప్పారు. ఏ సమస్య వచ్చినా గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

## మహిళల అక్రమ రవాణాను అరికట్టండి - వారి రక్షణను బలోపేతం చేయండి

○ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ




**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్ హాల్‌లో శుక్రవారం మహిళల రక్షణపై ట్రాఫికింగ్‌ను అరికట్టండి– రక్షణను బలోపేతం చేయండి అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, పిల్లలను లైంగిక దోపిడీ కోసం అక్రమ రవాణా (ట్రాఫికింగ్) చేయడం ఒక తీవ్రమైన సామాజిక సమస్యగా మారిందన్నారు. యాంటీ–హ్యూమన్ ట్రాఫికింగ్ చర్యల ద్వారా ఈ సమస్యను అరికట్టడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. బాధితులకు భరోసా కల్పించడం, వారికి రక్షణ కల్పించడం ఈ సమావేశం ముఖ్య లక్ష్యమని తెలిపారు. బాధితులతో, ముఖ్యంగా ట్రామాలో ఉన్న వారితో ఎలా మాట్లాడాలి, కేసులను ఎలా విచారించాలి, వారి నుంచి కీలక సమాచారాన్ని ఎలా సేకరించాలి వంటి అంశాలపై సమగ్రంగా ఈ కార్యక్రమంలో అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారన్నారు.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 126 ట్రాఫికింగ్ కేసులు నమోదయ్యాయని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పరిస్థితులు మెరుగ్గా ఉన్నప్పటికీ కేసుల సంఖ్యను తగ్గించడంపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. సాంకేతికతను ఎక్కువగా ఉపయోగించడంతోపాటు శక్తి యాప్, ఇతర డిజిటల్ సాధనాల ద్వారా నిందితులను త్వరగా గుర్తించడం, కేసుల విచారణను వేగవంతం చేయడం వంటి అంశాలపై చర్చించినట్లు వెల్లడించారు. నిందితులకు శిక్ష పడేలా చేయడంలో విభాగాల మధ్య సమన్వయం పెంచుకోవడం అవసరమని, ఉద్యోగాల పేరుతో, ప్రేమ పేరుతో జరిగే మోసాలు మరియు బలవంతపు కార్మికుల అక్రమ రవాణాను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ముందస్తు జాగ్రత్తలు, అప్రమత్తత ద్వారా అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించవచ్చని, ఈ సమావేశం ద్వారా అధికారులకు ఉన్నతమైన దర్యాప్తు పద్ధతులు నేర్పడమే కాకుండా రాష్ట్రంలో కేసుల తీవ్రతను తగ్గించడంపై దృష్టి పెట్టామని చైర్‌పర్సన్ పేర్కొన్నారు.

ఆర్పీఎఫ్ ఎస్పీ షణ్ముఖం మాట్లాడుతూ... మాజీ ఐపీఎస్ అధికారి పి.ఎం. నాయర్ శిక్షకుడిగా వ్యవహరించి అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో రైల్వే డివిజనల్ మేనేజర్, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, మహిళా అభివృద్ధి శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ఏప్రిల్ 25న నిర్వహించడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మలేరియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, నివారణ చర్యలను బలోపేతం చేయడం ముఖ్య లక్ష్యంగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ సంవత్సరం "మలేరియా రహిత సమాజం కోసం కలిసికట్టుగా ముందుకు" అనే నినాదంతో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

మలేరియా అనేది దోమల ద్వారా వ్యాపించే వ్యాధి అని, ఆడ అనోఫిలీస్ దోమ కాటు వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. జ్వరం, వణుకు, చెమట, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. మలేరియాను నివారించడానికి ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమల పెరుగుదల లేకుండా చర్యలు తీసుకోవాలని, దోమతెరలు, రిపెలెంట్లు వినియోగించాలని, పూర్తిగా చేతులు, కాళ్లు కప్పుకునే దుస్తులు ధరించాలని, జ్వరం వచ్చిన వెంటనే సమీప వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం మలేరియా నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో దోమల నివారణ చర్యలు, ఫాగింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. మలేరియా పూర్తిగా నివారించగలిగే వ్యాధి అని, ప్రజల భాగస్వామ్యం, పరిశుభ్రత పాటించడం ద్వారా మలేరియాను పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు.

## బీసీ బిడ్డ కుటుంబానికి ఆర్థికసాయం



○ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాలు కోల్పోయిన కడప జిల్లా తొండూరు బీసీ హాస్టల్ విద్యార్థి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బిడ్డ చనిపోతే కన్నతల్లి పడే వేదన వర్ణనాతీతమని, ఆ శోకం నుంచి కోలుకోవడం అసాధ్యమని ఆవేదన వ్యక్తంచేశారు. పుట్టెడు దు:ఖంలో ఉన్న ఆ కుటుంబానికి తాము ఉన్నామనే భరోసా కల్పించడానికే ఈ చిన్నపాటి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వేంపల్లి మండల కేంద్రానికి చెందిన గురు ప్రణీత్ కుమార్(11) తొండూరు బీసీ హాస్టల్ ఉంటూ ఆరో తరగతి చదువుతున్నాడన్నారు. వేసవి సెలవులు ఇవ్వడంతో, అదే హాస్టల్ లో ఎనిమిదో తరగతి చదువుతున్న అన్నయ్య, తల్లితో కలిసి ఆటోలో సొంతూరు పయనమయ్యాడన్నారు. వాటర్ బాటిల్ కొని తిరిగి వస్తుండగా, టిప్పర్ లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో గురు ప్రణీత్ కుమార్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. పసి ప్రాయంలోనే విద్యార్థి విగతజీవిగా మారడం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. ఇదే విషయం సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లగానే, బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారన్నారు. త్వరలోనే ఈ ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందజేస్తామని మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

## మలేరియాపై వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన కమీషనర్ వీరపాండియన్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మలేరియా నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రచార, అవగాహన గోడపత్రాలు, కరపత్రాలను ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి. వీరపాండియన్ శుక్రవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమం కింద రాష్ట్రంలో మలేరియా నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మలేరియా నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు.

మలేరియా వ్యాధిపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్న ఆయన, ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించడం, దోమల పెరుగుదలకు అనుకూల పరిస్థితులను నివారించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు.

"మలేరియా నిర్మూలన దిశగా ముందుకు సాగుదాం -- ఇప్పుడు మనకు సాధ్యం, ఇప్పుడు తప్పనిసరి" అనే నినాదంతో ముందుకు సాగాలని, మలేరియా నిర్మూలన లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వ్యాధి నియంత్రణ కార్యక్రమం అదనపు సంచాలకురాలు డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ వర్సిటీ , ఇంటెల్ ఇండియా మధ్య చారిత్రాత్మక అవగాహన ఒప్పందం

○ ఏఐ విద్యార్థులకు.వేగంగా ఉద్యోగ అవకాశాలు

○ ఏఐ నైపుణ్యాన్ని అందించటమే లక్ష్యం

○ విద్యార్థులకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం అందజేత



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ , ప్రముఖ టెక్ దిగ్గజం బెంగళూరులోని ఇంటెల్ టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య కీలక అవగాహన ఒప్పందం కుదిరిందని వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను ఇంటెల్ ఇండియా కంపెనీ ఆసియా పసిఫిక్ అండ్ జపాన్ రీజియన్ సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ సలోని సింఘాల్‌కు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు అందజేశారు.

ఈ సందర్భంగా ఇంచార్జి వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో వేగంగా పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఏఐ) నైపుణ్యాలను అందించడం ఈ అవగాహన ఒప్పందం ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థుల్లో ఏఐ పై సమగ్ర అవగాహన పెంపొందించడం, సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, స్వతంత్రంగా నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అదేవిధంగా ఉపాధి అవకాశాలకు అవసరమైన టెక్నాలజీ, కెరీర్ మరియు సామాజిక నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా, ఇండస్ట్రీ మరియు సామాజిక సమస్యలకు ఏఐ ఆధారిత పరిష్కారాలను రూపొందించే దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా ఫ్యాకల్టీ మరియు ట్రైనర్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం, విద్యార్థులకు కో బ్రాండెడ్ సర్టిఫికెట్లు అందించడం, ఉపాధి అవకాశాలపై మార్గదర్శకత కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. అదనంగా, ఈ అవగాహన ఒప్పందాన్ని సర్టిఫికెట్, డిప్లొమా లేదా డిగ్రీ కోర్సుల రూపంలో విస్తరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇక యూనివర్సిటీ స్థాయిలో ఫ్యాకల్టీ ఎంపిక చేసి వారికి ఇండస్ట్రీ అనుసంధానిత శిక్షణ అందించడం, కార్యక్రమ అమలుకు అవసరమైన వనరులు సమకూర్చడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, అలాగే డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా విస్తృత ప్రచారం కల్పించడం వంటి చర్యలు చేపడతామని వివరించారు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు భవిష్యత్తు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో పోటీతత్వాన్ని పెంపొందించుకొని, కృత్రిమ మేధస్సు రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా మార్గనిర్దేశం చేయడం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంటెల్ ఇండియా ఆసియా పసిఫిక్ ,జపాన్ రీజియన్ సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ సలోని సింఘాల్ మాట్లాడుతూ, విజ్ఞాన్స్ యూనివర్సిటీతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. డిజిటల్ యుగానికి అనుగుణంగా విద్యార్థులను సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాల వైపు దారితీస్తూ, ముఖ్యంగా ఏఐ నైపుణ్యాలను అందించి వారిని భవిష్యత్తుకు సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇంటెల్ ఇండియా రూపొందించిన కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన 601 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే "ఏఐ స్మార్ట్ క్యాంపస్ హ్యాకథాన్"లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇంటెల్ ఇండియా నేషనల్ ఆపరేషన్స్ మేనేజర్ విక్రమ్ పర్మార్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఇంచార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467